

మోదీ పాలనకు చరమగీతం పాడండి

- కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పిలుపు
- అవినీతికి వర్శిటీ ఉంటే మోదీయే ఛాన్సలర్
- సీఎం స్టాలిన్

చెన్నై, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలోని నిరంకుశుడైన ప్రధాని మోదీ పాలనకు చరమగీతం పాడాలని, పేరుకు మోదీ పాలన అని చెబుతున్నా, పదేళ్లుగా దేశాన్ని పాలించింది అదానీయే అని చెప్పడం అతిశయోక్తి కాదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. కోయంబత్తూరు శెట్టి పాళయం వద్ద శుక్రవారం సాయంత్రం ఇండియా కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఏర్పాటైన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ... పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం కోట్లకుపడగలెత్తిన 21 మంది ధనవంతుల కోసం దేశంలోని 70 శాతం ప్రజల సొమ్మును దోచుకుందని ధ్వజమెత్తారు. ఆ ధనవంతుల రూ.16లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. దేశంలో ప్రతిరోజూ 30 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వారి రుణాలను మాఫీ చేయకపోగా, వారి సమస్యలను పరిష్కరించకుండా మొండి వైఖరినే అవలంబిస్తారన్నారు. ప్రధాని మోదీకి అత్యంత ప్రియమైన అదానీ సహా ముగ్గురు పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రభుత్వ కాంట్రాక్టులను ధారాదత్తం చేశారని మండిపడ్డారు. అదానీకి ప్రభుత్వం కల్పించిన రాయితీల గురించి ప్రస్తావిస్తే తన ఎంపీ పదవికి ఎసరు పెట్టారని, ఢిల్లీలో తాను నివసిస్తున్న ఇంటినుంచి వెళ్లగొట్టారన్నారు. ఆ చర్యలకు తాను భయపడలేదన్నారు. తనకు ఇల్లు లేదన్న బాధ లేదని, తనను ప్రేమించే లక్షలాది మంది తమిళులు వారి హృదయాలలో సుస్థిర స్థానం కల్పించారని, అదే తనకు ఆనందం కలిగిస్తోందన్నారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వల్ల దేశంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లోని పోస్టులన్నీ ఆర్ఎస్ఎస్ సభ్యులతో భర్తీ చేశారన్నారు. ప్రస్తుతం తమిళసీమ ముద్దుబిడ్డలైన పెరియార్, అన్నాదురై, కామరాజర్, కరుణానిధి వంటి నేతలు రూపొందించిన సామాజిక న్యాయానికి, మతతత్వ ఫాసిస్టు దుష్ట శక్తులకు మధ్య భీకర యుద్ధం ప్రారంభమైందని, ఈ సంగ్రామంలో అంతిమ విజయం ఇండియా కూటమిదేనని చెప్పారు. ప్రధాని మోదీ తరచూ తమిళనాట పర్యటిస్తూ తనకు ఇడ్లీ, వడ ఇష్టమని చెబుతారని, ఢిల్లీ వెళ్లాక ఒకే దేశం, ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే రకమైన ఆహారం అంటూ చెబుతారని, ఇది ఆయన ద్వంద వైఖరికి నిదర్శనమన్నారు. ఎన్నికల బాండ్ల అవినీతిపై సుప్రీంకోర్టు జోక్యంచేసుకున్న తర్వాతే బీజేపీ ప్రభుత్వం ఐటీ, ఈడీ, సీబీఐ సంస్థల ద్వారా బెదరించి కోట్లాది రూపాయాలను విరాళాలుగా పొందినట్లు వెల్లడైందన్నారు.

ఆ వర్శిటీకి ...

ప్రపంచంలో ఎక్కడైనా అవినీతిపై విశ్వవిద్యాలయం ఉంటే దానికి ఛాన్సలర్‌గా వ్యవహరించే అన్ని అర్హతలు ప్రధాని మోదీకి ఉన్నాయని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధ్వజమెత్తారు. ఈ సభలో రాహుల్‌తో కలిసి వేదిక పంచుకున్న స్టాలిన్ మాట్లాడుతూ... దేశానికి దుష్ట శక్తుల నుంచి ఆపద సంభవించే సమయాల్లో డీఎంకే, కాంగ్రెస్ అండగా ఉండటం ఆనవాయితీ అని, ఆ దిశగానే ప్రస్తుతం మతతత్వ శక్తులకు, సెక్యులర్ పార్టీలకు నడుమ ప్రారంభమైన ద్వితీయ స్వాతంత్ర్య సంగ్రామంలో విజయం సాధించేందుకు రెండు పార్టీలు కలిసికట్టుగా పోరాడుతున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రజలు ఎల్లప్పుడూ సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై ఆదరాభిమానాలను ప్రదర్శిస్తుంటారని, ప్రచార సభకు రాహుల్ రావటంతో ఇండియా కూటమి పార్టీలలో ఉత్సాహం అధికమైందన్నారు. కాంగ్రెస్ ఇటీవల విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో, డీఎంకే విడుదల చేసిన మేనిఫెస్టో సామాజిక న్యాయాన్ని చాటే విధంగా ఉన్నాయన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమికి హీరో కాంగ్రెస్ మేనిఫెస్టోయేనన్నారు. ప్రధాని నరేంద్రమోదీ తరచూ డీఎంకేని కుటుంబ పార్టీ అని, ప్రభుత్వాన్ని కుటుంబ పాలన అని పదే పదే విమర్శించడం ఆనవాయితీగా మారిందని, వాస్తవానికి అవినీతిలో పీకలదాకా మునిగిన నేతగా మోదీ మారిపోయారని, అందుకు ఎన్నికల బాండ్ల అవినీతే చక్కటి ఉదాహరణ అని తెలిపారు.

ఈడీ, ఐటీ, సీబీఐ ద్వారా దాడులు జరిపి బెదిరించి పారిశ్రామికవేత్తల నుండి, వాణిజ్యవేత్తల నుండి విరాళాలను ఎన్నికల బాండ్ల పేరుతో పొందినట్లు మోదీ గుట్టు రట్టయ్యిందన్నారు. డీఎంకే ప్రభుత్వాన్ని కుటుంబ పాలన అని మోదీ విమర్శించడం ఓటేసి గెలిపించిన తమిళ ప్రజలందరినీ అవమానించడమే అవుతుందన్నారు. పదేళ్లుగా రాష్ట్రాన్ని పట్టించుకోని బీజేపీ కూటమిని, పదేళ్లపాటు రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిన అన్నాడీఎంకే కూటమిని చిత్తుగా ఓడించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలంతా తమ ప్రభుత్వాన్ని అండగా ఉంటున్నట్లు తన ప్రచార పర్యటనల ద్వారా తెలుసుకున్నానని, కలైంజర్ సాధికారిక నగదును లబ్ధిదారులైన గృహిణులు స్టాలిన్ అన్నయ్య అందిస్తున్న పుట్టింటి కానుకగా సగర్వంగా చెబుతున్నారని పేర్కొన్నారు. త్వరలో తమిళ్‌పుదల్వన్ పథకం పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థినులకు ఉన్నత విద్యా కోర్సులు చదివేందుకు ప్రతినెలా ఇస్తున్న రూ.1000 పథకాన్ని విస్తరిస్తామని సభికుల హర్షధ్వానాల నడుమ స్టాలిన్ ప్రకటించారు ఇండియా కూటమి అధికారంలోకి వస్తే డీఎంకే మేనిఫెస్టోలోని హామీలన్నింటినీ నెరవేరుస్తామన్నారు. తెలుగు వైజ్ఞానిక వేత్త జీడీ నాయుడు జన్మించిన కోయంబత్తూరులో అంతర్జాతీయ స్థాయి వైజ్ఞానిక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తామని స్టాలిన్ హామీనిచ్చారు.

మేం అధికారంలోకి వస్తే...

ఇండియా కూటమి అధికారంలోకి వస్తే కేంద్రప్రభుత్వ సర్వీసుల్లో యేళ్లతరబడి ఖాళీగా ఉన్న 30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కలిగే దిశగా వారిని యేడాదిపాటు ప్రైవేటు సంస్థలలో అప్రెంటీస్‌గా పనిచేసే పథకాన్ని ప్రవేశపెట్టి యేడాదిపాటు వారికి జీతభత్యాలందిస్తామన్నారు. ప్రతి నిరుపేద కుటుంబంలోనూ ఓ మహిళను ఎంపిక చేసి యేడాదికి లక్ష రూపాయలను ఆమె ఖాతాలో జమచేసే పథకాన్ని అమలు చేస్తామ భరోసా ఇచ్చారు. తమిళసీమలో అడుగు పెడితేనే తనకు సంతోషం కలుగుతుందని, తనపైనా, తన కుటుంబ సభ్యులపై దశాబ్దాల తరబడి తమిళ ప్రజలు చూపుతున్న ఆదరాభిమానాలను మరిచిపోలేనని రాహుల్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్‌ను రాహుల్ బ్రదర్ అని సంబోధించినప్పుడల్లా జనం చప్పట్లు చరిచారు.



స్టాలిన్, రాహుల్ అభివాదం



బహిరంగసభకు తరలివచ్చిన జనం

అట్టహాసంగా అమిత్‌షా రోడ్‌షో

మోదీ నినాదాలతో దద్దరిల్లిన మదురై నగరం

చెన్నై, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మదురైలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా బీజేపీ అభ్యర్థి రామశ్రీనివాసన్‌కు మద్దతుగా శుక్రవారం సాయంత్రం నిర్వహించిన రోడ్‌షో ఆద్యంతం అట్టహాసంగా సాగింది. ఈ రోడ్‌షోలో పాల్గొనే నిమిత్తం ఆయన తొలుత మదురై విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో కారైక్కుడికి వెళ్లి అక్కడి నుంచి కారులో పుదుకోట జిల్లా తిరుమయ్యమ్ కోట్టై భైరవర్ ఆలయాన్ని, సత్యవాగీశ్వరాలయాన్ని సందర్శించారు. ఆ తర్వాత సాయంత్రం మదురై నగరానికి చేరుకున్న అమిత్‌షాకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం రథం ఆకారంలో రూపొందించిన వ్యాన్ ఎక్కి రోడ్‌షోలో పాల్గొన్నారు. రోడ్‌షో ప్రారంభమైనప్పటి నుంచికార్యకర్తలంతా 'మోదీ మోదీ' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. రహదారికి ఇరువైపులా చండీ మేళాలు, మంగళవాయిద్యాలు, బ్యాండ్ వాయిద్యాల నడుమ ఈ రోడ్‌షో ప్రారంభమైంది. మదురై నేతాజీ రోడ్డు నుంచి ఝాన్సీరాణి పార్కు, నగల దుకాణం బజార్ మీదుగా విలక్కుతూన్ ప్రాంతం వరకు రోడ్‌షో కొనసాగింది. ఈ కార్యక్రమంలో 'భారత్ మాతాకీ జై.. జై బీజేపీ, మా ఓట్లన్నీ బీజేపీకే' అంటూ కార్యకర్తల చేసిన నినాదాలు మిన్నంటాయి. అమిత్‌షా తామర గుర్తు ముద్రించిన ప్లాస్టిక్ బొమ్మను పట్టుకుని రహదారికి ఇరువైపులా నిలిచిన ప్రజలకు అభివాదం చేస్తూ, ప్రజలపై గులాబీ పూల వర్షం కురిపిస్తూ సందడి చేశారు. అమిత్‌షా వాహనానికి ముందుగా భారతమాత, కాళికాదేవి, దేవతమూర్తుల వేషధారణలతో కళాకారులు నడిచి వెళ్లారు. అదే సమయంలో వందలాదిమంది కార్యకర్తలు ప్రధాని నరేంద్రమోదీ మాస్కులు ధరించి సందడి చేశారు. అమిత్‌షా రోడ్‌షోకు పోలీసులు భారీ భద్రతా కల్పించారు.



కమలం గుర్తుతో ప్రజలకు అభివాదం చేస్తున్న అమిత్‌షా

మదురైలో చిత్తిరై ఉత్సవాల ప్రారంభం

చెన్నై, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రం మదురై మీనాక్షి సుందరేశ్వరర్ ఆలయంలో చిత్తిరై ఉత్సవాలు శుక్రవారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. మదురైలో శైవ, వైష్ణవ మతాల సమైక్యతకు ప్రతీకగా ఇటు మీనాక్షి అమ్మవారి ఆలయ చిత్తిరై ఉత్సవాలు, అటు కళ్లలగర్ చిత్తిరై ఉత్సవాలు జరుగుతాయి. ఈ నేపథ్యంలోనే మీనాక్షి సుందరేశ్వరర్ ఆలయంలో చిత్తిరై ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆ సందర్భంగా ఆలయంలో స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆ తర్వాత ఉత్సవ మూర్తులను వివిధ రకాల ఫలపుష్పాలతో, స్వర్ణ, వజ్రాభరణాలతో అందంగా అలంకరించారు. సర్వాలంకరణ శోభితులైన మీనాక్షి, సుందరేశ్వరర్ ధ్వజస్తంభ మండపం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక పీఠంపై ఆశీనులయ్యారు. అదే సమయంలో ధ్వజస్తంభాన్ని అందంగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకులు, శైవాగమపండితులు మంత్రోచ్ఛాటనలు, మంగళవాయిద్యాలు, భక్తజనం నడుమ ధ్వజారోహణం నిర్వహించారు. ఆ సందర్భంగా ప్రత్యేక దీపారాధన, కర్పూర హారతి, నైవేద్యం సమర్పించారు. ఈ వేడుకల్లో మహిళా భక్తులు వేలసంఖ్యలో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా ప్రతిరోజూ మీనాక్షి అమ్మవారు సమేత సుందరేశ్వరర్ ఉదయం, సాయంత్రం వివిధ వాహనాల్లో ఆలయ వీధులలో విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు. ఈ నెల 19న మీనాక్షి అమ్మవారి పట్టాభిషేక మహోత్సవం జరుగుతుంది. 21న మీనాక్షి సుందరేశ్వరర్ తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరగనుంది. 22న మహా రథోత్సవం నిర్వహించనున్నారు. మీనాక్షి ఆలయ చిత్తిరై ఉత్సవాలు జరుగుతున్న సమయంలోనే మదురై సమీపంలోని సుప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం కళ్లలగర్ ఆలయ చిత్తిరై ఉత్సవాలు కూడా జరగనున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా కళ్లలగర్ స్వామి వైగై నదిలో వేంచేసి లక్షలాదిమంది భక్తులకు దర్శనమిచ్చి అనుగ్రహించనున్నారు. ప్రజాపనులు, దేవాదాయ శాఖ అధికారులు సంయుక్తంగా ఈ ఉత్సవ ఏర్పాట్లను చేపడుతున్నారు.



ఆలయ ప్రాంగణంలో ధ్వజారోహణం చేస్తున్న శైవ పండితులు, ప్రధానార్చకులు



ఆలయ మండపంలో కొలువుదీరిన మీనాక్షి, సుందరేశ్వరర్

శ్రీవారి ఆలయ విస్తరణకు మరో రూ.కోటి విరాళం



కోకిలాబెన్ అంబానీ బృందంతో ఏజే శేఖర్ తదితరులు



ఏజే శేఖర్‌కు చెక్కు అందజేస్తున్న నాగరాజ్

చెన్నై, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ వెంకట నారాయణరోడ్డులో ఉన్న శ్రీవారి ఆలయ విస్తరణ కోసం రూపొందించిన 'భూదానం పథకం'లో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సమాచార కేంద్ర సలహామండలి సభ్యుడు నాగరాజ్ రూ.కోటి విరాళంగా అందజేశారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో స్థానిక సలహా మండలి ఛైర్మన్ ఏజే శేఖర్‌కు ఈ మేరకు చెక్కును అందజేశారు. ఆలయ విస్తరణ కోసం ఏజే శేఖర్ బృందం కృషి చేస్తున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా రిలయన్స్ గ్రూపు అధినేతల మాతృమూర్తి కోకిలాబెన్ అంబానీ, ఆమె కుమార్తె నీనా కొఠారి శనివారం టి.నగర్‌లోని శ్రీవారి ఆలయాన్ని దర్శించారు. వారికి ఏజే శేఖర్, డిప్యూటీ ఈవో విజయకుమార్, సభ్యులు అనిల్‌కుమార్‌రెడ్డి, మోహన్‌రావు తదితరులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోకిలా బెన్ బృందం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించింది. అనంతరం అర్చకులు వారికి శ్రీవారి లడ్డూ ప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు.

ఐటీ దాడుల్లో రూ.74 కోట్ల స్వాధీనం

- మహిళా ప్రోత్సాహక నిధి పంపిణీలపై నిషేధం లేదు
- ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రదసాహు

పెరంబూర్, ఏప్రిల్ 12: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో జరిగిన తనిఖీల్లో ఇప్పటివరకు రూ.74 కోట్లను ఆదాయపు పన్ను శాఖ స్వాధీనం చేసుకుందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రదసాహు తెలిపారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా రూ.1,000 అందజేస్తున్న మహిళా ప్రోత్సాహక నిధికి ఎలాంటి అడ్డంకులు లేవని తెలిపారు. రాష్ట్రంలోని 39 నియోజకవర్గాల్లో ఈ నెల 19వ తేది ఒకే విడతలో ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలకు సంబంధించిన తుదిదశ ఏర్పాట్లు పూర్తయిన నేపథ్యంలో, సచివాలయంలో ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రదసాహు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఇప్పటివరకు 70 శాతం ఓటర్లకు బూత్ స్లిప్పులు (4.36 కోట్ల మందికి) అందజేశామన్నారు. శనివారంలోగా 100 శాతం స్లిప్పులు అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారులకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు. మొదటి సారి ఓటు వేయనున్న వారికి 100 శాతం ఓటరు గుర్తింపుకార్డులు అందించామన్నారు. ఎన్నికల సంఘ జాబితాలో ఉన్న గుర్తుల మేరకు నామ్ తమిళర్ పార్టీకి గుర్తును ఈవీఎంలలో పొందుపరిచామని, ఈ విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక పంపామని తెలిపారు. నీలగిరి జిల్లా సహాయ వ్యయ పరిశీలకులు పంపిన ఫిర్యాదు ఇంకా అందలేదని, పత్రికల్లో ప్రచురితమైన సమాచారం ఆధారంగా జిల్లా ఎన్నికల అధికారిని నివేదిక కోరామని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు...

అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించామన్నారు. దివ్యాంగులు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లేలా మూడు చక్రాల కుర్చీలు అందుబాటులో ఉంటాయన్నారు. తపాలా ఓటు నమోదులో మార్పులు చేపట్టామని తెలిపారు. ఆ ప్రకారం, తిరుచ్చిలో తపాలా ఓట్ల కోసం రాష్ట్రస్థాయి సమీకృత కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, అక్కడి నుంచి వివిధ జిల్లాలకు తపాలా ఓట్లు పంపించనున్నామని తెలిపారు. పాత పద్ధతిలో చెన్నైలో పనిచేసే వ్యక్తి ఓటు కన్నియాకుమారిలో ఉంటే చెన్నైకి చెందిన ఓ అధికారి కన్నియాకుమారికి వెళ్లి పోస్టల్ బ్యాలెట్లు తీసుకొచ్చే విధానం అమలులో ఉందన్నారు. ఈ విధానంలో చేపట్టిన మార్పుల కారణంగా తిరుచ్చి నుంచి అన్ని జిల్లాలకు తపాలా ఓట్లు పంపుతామని తెలిపారు. మహిళలకు నెలా నెలా రూ.1,000 సహా ప్రస్తుతం అమలవుతున్న ప్రభుత్వ పథకాలు కొనసాగించవచ్చని, అందుకు ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి అనుమతి అవసరం లేదని తెలిపారు. నామ్ తమిళర్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసిన తపాలా బ్యాలెట్ పేపర్ సోషల్ మీడియాలో వెలువడడంపై సంబంధిత జిల్లా అధికారిని నివేదిక కోరామని సత్యప్రదసాహు తెలిపారు.

నగదు, బహుమతుల స్వాధీనం...

రాష్ట్రంలో రూ.305.36 కోట్ల విలువైన నగదు, బహుమతులు స్వాధీనం చేసుకున్నట్లు సత్యప్రదసాహు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఓటర్లకు నగదు, బహుమతుల పంపిణీ అడ్డుకొనేలా ఏర్పాటుచేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ సహా ఫిర్యాదుల ఆధారంగా ఐటీ శాఖ అధికారులు తనిఖీలు చేపడుతున్నారని తెలిపారు. ఆ ప్రకారం, గురువారం వరకు రూ.144.44 కోట్ల నగదు, రూ.5.13 కోట్ల విలువైన మద్యం, రూ.94 లక్షల విలువైన మాదకద్రవ్యాలు, రూ.121.77 కోట్ల బంగారం, వెండి ఆభరణాలు, రూ.32.08 కోట్ల విలువైన బహుమతులు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు.

సమాచార ధ్వని

మెడికల్ జర్నలిజం కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

సిఐఎఫ్, ఏప్రిల్ 12: తమిళనాడు ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పీజీ మెడికల్ జర్నలిజం డిప్లొమా కోర్సులో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. సంవత్సరం కోర్సులో మూడు సెమిస్టర్లుంటాయి. ఆసక్తి ఉన్న వారు వర్సిటీ వెబ్‌సైట్, వర్సిటీ ఈ-మెయిల్ చిరునామాలో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు నెం.044-22200713లో సంప్రదించవచ్చు.

సాహిత్యాల్లో 'సేయోన్'పై శిక్షణ

ఐసిఎఫ్, ఏప్రిల్ 12: నగరంలో ఉన్న కేంద్ర ప్రభుత్వ సంస్థ శాస్త్రీయ తమిళ పరిశోధన సంస్థలో మే 15 నుంచి సాహిత్యాల్లో 'సేయోన్' అనే శీర్షికపై వారం రోజులు శిక్షణ ఇవ్వనున్నారు. తమిళుల దైవమైన మురుగన్ పర్యాయ పదాల్లో ఒకటైన సేయోన్‌పై రచించిన సాహిత్యాలు, కీర్తనలు వంటి వాటికి సంబంధించి శిక్షణ తరగతులు జరగనున్నాయి. ఆసక్తి ఉన్న వారు మే 2వ తేదిలోగా https://forms.gle/drzR2eJR1aoyGpXraలో దరఖాస్తు చేసుకోవచ్చు.

హాకీ కోచ్‌లకు మూడు రోజుల ప్రత్యేక శిబిరం

ఐసిఎఫ్, ఏప్రిల్ 12: రాష్ట్రంలో ఉన్న హాకీ కోచ్‌లకు నైపుణ్యం కలిగిన కోచ్‌ల ద్వారా మూడు రోజులు శిక్షణ ఇవ్వనున్నారు. రాష్ట్ర హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి 28వ తేది వరకు స్థానిక ఎగ్మూర్ మేయర్ రాధాకృష్ణన్ హాకీ మైదానంలో నిర్వహించనున్న శిబిరంలో రాష్ట్ర, జాతీయ పాల్గొన్న క్రీడాకారులు పాల్గొనవచ్చు. వీరికి ఒలంపిక్‌లో స్వర్ణం గెలుచుకున్న క్రీడాకారులు శిక్షణ ఇవ్వనున్నారు. ఇతర వివరాలకు నెం.8428660299లో సంప్రదించవచ్చు.

ఆమ్నీ బస్సుల్లో 80 శాతం రిజర్వేషన్లు

ఐసిఎఫ్, ఏప్రిల్ 12: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని ఆమ్నీ బస్సుల్లో 80 శాతం టిక్కెట్లు రిజర్వేషన్లు పూర్తయ్యాయని రాష్ట్ర ఆమ్నీ బస్సుల యజమానుల సంఘ అధ్యక్షుడు అన్బళగన్ తెలిపారు. పోలింగ్ రోజైన ఈనెల 19వ తేది ఓటు వేసేందుకు సొంతూళ్లకు వెళ్లే ఓటర్లు ప్రభుత్వ బస్సులతో పాటు ఆమ్నీ బస్సుల్లో టిక్కెట్లు రిజర్వేషన్ చేయించుకుంటున్నారు. చెన్నై నుంచి 2,100, ఇతర నగరాల నుంచి 1,150 ఆమ్నీ బస్సులు వివిధ ప్రాంతాలకు నడుస్తుండగా, ఈ నెల 17వ తేది ప్రయాణానికి 70 శాతం, 18వ తేది ప్రయాణానికి 80 శాతం, 20, 21 తేదీల్లో ఇతర నగరాల నుంచి చెన్నైకు 70 శాతం రిజర్వేషన్లు ముగిశాయని అన్బళగన్ తెలిపారు.

విమానాశ్రయంలో కొత్త వసతులు

ఐసిఎఫ్, ఏప్రిల్ 12: చెన్నై విమానాశ్రయం టెర్మినల్-1 నుంచి బయల్దేరే ప్రయాణికులకు సెల్ఫ్ ప్యాకేజ్ డ్రాఫ్ట్ అనే ఫాస్ట్ ట్రాక్ సౌకర్యం కల్పించారు. ఈ సౌకర్యం ద్వారా ఇండిగో ఎయిర్‌లైన్స్ విమాన ప్రయాణికులు తమ లగేజీలను ఆటోమేటిక్ యంత్రాల ద్వారా స్కాన్ చేసి కన్వేయర్ బెల్ట్ ద్వారా విమానంలోకి పంపించవచ్చు. దీని కోసం 60 నుంచి 63 వరకు భద్రతా తనిఖీ కౌంటర్లు ఆటోమేటిక్ విధానానికి మార్చారు. దీంతో వేచి ఉండే సమయం ఆదా అవుతుంది. అంచెలంచెలుగా ఇతర విమాన సంస్థల ప్రయాణికులకు ఈ సదుపాయం కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

సోలార్ ద్వారా 58 లక్షల యూనిట్ల విద్యుదుత్పత్తి

పెరంబూర్, ఏప్రిల్ 12: దక్షిణ రైల్వేలో సోలార్ విద్యుత్ పరికరాల ద్వారా 58 లక్షల యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగింది. అందువల్ల దక్షిణ రైల్వేకు రూ.2.70 కోట్లు ఆదా అయినట్లు అధికారులు తెలిపారు. దక్షిణ రైల్వేలో సోలార్, పవన తదితరాల ద్వారా విద్యుదుత్పత్తి చేపడుతున్నారు. మొత్తం 5.07 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా గత 2021-22 సంవత్సరంలో 5.47 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరగ్గా, సుమారు రూ.2.3 కోట్లు ఆదా చేశారు. అలాగే, 2022-23 సంవత్సరంలో 58 లక్షల యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగి రూ.2.7 కోట్లు ఆదా అయ్యిందని అధికారుల తెలిపారు. అలాగే, 105 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పవన విద్యుత్ ఉపకరణాలు ఏర్పాటు చేయగా, 2022-23 ఆర్థిక సంవత్సరంలో 250 లక్షల యూనిట్లు విద్యుదుత్పత్తి జరిగి, రూ.13.70 కోట్లు ఆదాయ అయినట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

తిరుచానూరు వరకే సప్తగిరి, మెమో ఎక్స్‌ప్రెస్ రైళ్లు

పెరంబూర్, ఏప్రిల్ 12: తిరుపతి యార్డ్ పరిధిలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా ఈ నెల 16 నుంచి 23వ తేది వరకు తిరుపతికి వెళ్లే సప్తగిరి సహా మెమో ఎక్స్‌ప్రెస్ రైళ్లు తిరుచానూరు వరకు మాత్రమే నడుస్తాయని దక్షిణ రైల్వే తెలిపింది. ఆ ప్రకారం, నెం.06727 మూర్ మార్కెట్ కాంప్లెక్స్ - తిరుపతి మెమో ఎక్స్‌ప్రెస్, నెం.06753 అరక్కోణం - తిరుపతి మెమో ఎక్స్‌ప్రెస్, నెం.16057 చెన్నై సెంట్రల్ - తిరుపతి సప్తగిరి ఎక్స్‌ప్రెస్, నెం.16053 చెన్నై సెంట్రల్ - తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఈనెల 16 నుంచి 23వ తేది వరకు తిరుపతికి బదులుగా తిరుచానూరు వరకు మాత్రమే నడుస్తాయి. మరోమార్గంలో ఈ రైళ్లు తిరుపతికి బదులుగా తిరుచానూరు నుంచి నడవనున్నాయి. అలాగే, నెం.16854/16853 విల్లుపురం - తిరుపతి - విల్లుపురం ఎక్స్‌ప్రెస్ రైళ్లు తిరుపతికి బదులుగా కాట్పాడి వరకే మాత్రమే వెళ్లి, అక్కడి నుంచి తిరుగు ప్రయాణమవుతాయని దక్షిణ రైల్వే తెలిపింది.

నేటినుంచి అగ్గిపెట్టెల తయారీ బంద్

పెరంబూర్, ఏప్రిల్ 12: తూత్తుకుడిలో శనివారం నుంచి 22వ తేది వరకు అగ్గిపెట్టెల తయారీ నిలిపివేస్తున్నట్లు నిర్ణయించారు. అగ్గిపెట్టెలు పేరుకుపోవడం, కొనుగోలు చేసిన ముడి పదార్థాల నగదు అందించలేని పరిస్థితి నెలకొంది. దీని నుంచి బయటపడేలా నిల్వ ఉన్న అగ్గిపెట్టెల బండళ్లు సరఫరా చేసేవరకు తయారీ నిలిపివేయాలని అగ్గిపెట్టల తయారీ కేంద్రాల యజమానుల సమాఖ్య నిర్ణయించింది.

చిరుత సంచారం... అరియలూరు జిల్లాలో పాఠశాలలకు సెలవు

పెరంబూర్, ఏప్రిల్ 12: చిరుత సంచరిస్తుండడంతో అరియలూరు జిల్లాలోని అన్ని పాఠశాలలకు శుక్రవారం సెలవు ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ ఆనిమేరి స్వర్ణ ఉత్తర్వులు జారీ చేశారు. మైలాడుదురై సహా చుట్టుపక్కల ప్రాంతాల్లో సంచరిస్తున్న చిరుత... అరియలూరు జిల్లా పొన్‌పరప్పి, సిదలవాడి ప్రాంతాల్లో తిరుగున్నట్లు గురువారం వార్తలు రావడంతో జిల్లా ప్రజలు భయాందోళన చెందుతున్నారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో పెటుకొని జిల్లాలోని అన్ని పాఠశాలలకు శుక్రవారం సెలవు ప్రకటించారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులను ఇళ్లకు పంపించినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. అలాగే, భద్రత దృష్ట్యా ప్రజలు అనవసరంగా బయటకు రావొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అరియలూరు జిల్లాలోని 22 ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన అటవీ శాఖ సిబ్బంది, చిరుత కోసం గాలిస్తున్నారు.

కొడైకెనాల్, తూత్తుకుడిలో అకాల వర్షం





కొడైకెనాల్ సరస్సు ప్రాంతం వద్ద వర్షం కారణంగా ఆగిన వాహనాలు - తూత్తుకుడిలో వర్షంలోనే తడుస్తూ సైకిలుపై వెళ్తున్న బడిపిల్లలు

చెన్నై, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో పడమటి దిశగా వీస్తున్న పెనుగాలులు, ఉపరితల ఆవర్తనం కారణంగా తూత్తుకుడి, కొడైకెనాల్ ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. ప్రముఖ పర్యాటక ప్రాంతం కొడైకెనాల్‌లో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం వేకువజాము వరకు కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. వారం రోజులుగా ఉగాది, రంజాన్ పండుగల సెలవుతో పాటు వారాంతపు సెలవులు కూడా తోడవటంతో వివిధ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో పర్యాటకులు కొడైకెనాల్‌కు విచ్చేస్తున్నారు. ఇటీవల కొడైకెనాల్ సమీపంలోని అడవుల్లో కార్చిచ్చు సహా వేసవి ఎండల కారణంగా వేడితో స్థానికులు, పర్యాటకులు ఇబ్బంది పడ్డారు. ఈ నేపథ్యంలో గురువారం అర్ధరాత్రి నుంచి కురిసిన వర్షానికి అన్ని ప్రాంతాల్లో చల్లదనం చోటుచేసుకుంది. అడవులలో కార్చిచ్చు తగ్గుముఖం పట్టింది. దీనితో స్థానికులు, పర్యాటకులు, వ్యాపారులు చల్లటి వాతావరణంలో ఉద్యానవనాలను సందర్శించారు.

తూత్తుకుడిలో...

తూత్తుకుడిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం మోస్తరుగా వర్షం కురిసింది. దీంతో నగరంలో వాతావరణం చల్లబడింది. రహదారులలో వర్షపు నీరు వరదలా ప్రవహించింది. విద్యార్థులు, కార్మికులు, వ్యాపారులు, వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. ఈ వర్షం కారణంగా ఉప్పు కయ్యల్లో నీరు ప్రవేశించడంతో ఉప్పు రైతులకు నష్టం ఏర్పడింది. ఒకటి రెండు రోజులలో ఉప్పును సేకరించాల్సిన తరుణంలో ఈ వర్షం కురిసి తమకు నష్టం వాటిల్ల జేసిందని ఆందోళన వ్యక్తంచేశారు.

కన్నియాకుమారి జిల్లాను ముంచెత్తిన వాన

ప్యారీస్, ఏప్రిల్ 12: వాతావరణంలో కలిగిన మార్పులతో కన్నియాకుమారి జిల్లాలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. తెల్లవారుజామున తేలికపాటి జల్లులతో ప్రారంభమైన వర్షం ఉదయం 9 గంటలకు ఉరుములు, మెరుపులతో కురిసింది. కన్నియాకుమారి, నాగర్‌కోయిల్, కొట్టాలం, సామితోపు, సుశీంద్రం, కులచ్చల్, కులిత్తురై, తక్కలై, మార్తాండం, దాడికరన్‌కోనం, బూదపాండి తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ప్రధాన రోడ్లు సైతం జలయముంగా మారాయి. గరిష్ఠంగా తక్కలైలో 6 మి.మీ వర్షపాతం నమోదైంది. ఎండలు మండుతున్న నేపథ్యంలో, కురిసిన వర్షంతో జిల్లా ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, రాష్ట్రంలో కోస్తా తీరంలో ఉన్న 10 జిల్లాల్లో శనివారం నుంచి మోస్తరు, తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముందని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం తెలియజేసింది.

కుట్రాలంకు జలకళ



చెన్నై, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లాల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం వేకువజాము వరకు ఉరుములు, మెరుపులతో భారీగా వర్షం కురవడంతో కుట్రాలం జలపాతం జలకళ సంతరించుకుంది. ఈ వర్షానికి తోడు పడమటి కనుమలల్లో రెండు రోజులుగా వర్షం కురుస్తుండడంతో పాత కుట్రాలం, ఐందరువి జలపాతాల వద్ద నీటిధారలు పడుతున్నాయి. శుక్రవారం ఉదయం ఆ జలపాతాల వద్ద పర్యాటకులు ఆనందంగా గడిపారు.

● లోక్‌సభ ఎన్నికలు....

తమిళనాడు, కేరళ రాష్ట్రాల సరిహద్దులు మూసివేయాలని నిర్ణయం

పెరంబూర్, ఏప్రిల్ 12: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని కంబం లో జరిగిన తమిళనాడు, కేరళ రాష్ట్రాల అధికారుల సమావేశంలో పోలింగ్ రోజున సరిహద్దు రోడ్లు మూసివేయాలని నిర్ణయించారు. తేని జిల్లా కలెక్టర్ ఆర్వీ షజీవన అధ్యక్షతన జరిగిన సమావేశంలో తేని, కేరళ రాష్ట్రం ఇడుక్కి జిల్లాల ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో రెండు రాష్ట్రాల్లో ఓటు వేయడాన్ని అడ్డుకొనేలా చర్యల తీసుకున్నట్టు తెలిపారు. అలాగే పొరుగు రాష్ట్రం నుంచి మద్యం తరలింపును అడ్డుకుంటామన్నారు. ఇడుక్కి జిల్లా కలెక్టర్ షీబాజార్జ్, తేని జిల్లా ఎస్పీ శివప్రసాద్, ఇడుక్కి జిల్లా ఎస్పీ టీకే విష్ణుప్రసాద్, తేని జిల్లా అటవీ శాఖ అధికారి సమర్థత, పెరియార్ పులుల శరణాలయ రేంజర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కోవైలో బీజేపీ - డీఎంకే కార్యకర్తల బాహాబాహీ

పెరంబూర్, ఏప్రిల్ 12: కోయంబత్తూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి అన్నామలైకు మద్దతుగా గురువారం సాయంత్రం ఆవారంపాళయంలో ప్రాంతంలో ఆ పార్టీ కార్యకర్తలు ప్రచారం చేపట్టారు. ఎన్నికల సమయం మించిపోయినా రాత్రి 10 గంటలకు పైగా వారు ప్రచారం చేయడంపై డీఎంకే కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో ఇరువర్గాల మధ్య చెలరేగిన వాగ్వాదం పరస్పర ఘర్షణకు దారి తీయడంతో ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై పీలమేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఎన్నికల సభల్లో కోతల్లేకుండా విద్యుత్తు

పెరంబూర్, ఏప్రిల్ 12: ఎన్నికల ప్రచారంలో ప్రముఖులు పాల్గొనే బహిరంగ సభల్లో విద్యుత్ కోతలు లేకుండా చర్యలు చేపట్టాలని విద్యుత్ బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు, ముఖ్యమంత్రి స్టాలిన్, ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి సహా పలు పార్టీల నేతలు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ప్రముఖులు పాల్గొనే ప్రాంతాల్లో విద్యుత్ కోతలు విధిస్తున్నట్లు పలు పార్టీలు విద్యుత్ బోర్డుకు ఫిర్యాదు చేస్తున్నాయి. వీటిపై స్పందించిన ఈబీ.. ప్రముఖులు పాల్గొనే బహిరంగ సభల ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, ఆ సమయంలో ప్రధాన ఇంజనీర్ సమీపంలోని ఉప విద్యుత్ కేంద్రంలో ఉండాలని, ప్రత్యేక బృందం ఆయా ప్రాంతాల్లో ఉంటూ విద్యుత్‌కు అంతరాయం కలిగితే సత్వరం మరమ్మతులు చేపట్టి సరఫరా పునరుద్ధరించాలని పేర్కొంది.

ఆంధ్ర, కేరళ నుంచి 10 వేలమంది పోలీసులు

ఐసిఎఫ్, ఏప్రిల్ 12: రాష్ట్ర ఎన్నికల భద్రతకు ఆంధ్ర, కేరళ రాష్ట్రాల నుంచి 10 వేల మంది పోలీసులు వచ్చారు. ఈనెల 19వ తేది లోక్‌సభ ఎన్నికల కోసం ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా బందోబస్తు ఏర్పాట్లు చేపడుతున్నారు. రాష్ట్రంలో 1.50 లక్షల మంది పోలీసులు భద్రతా విధుల్లో నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో, కేరళ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి అదనంగా వచ్చిన 10 వేల మంది పోలీసులను చెన్నై సహా వివిధ జిల్లాలకు పంపించారు.

మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ

వేలూరు, ఏప్రిల్ 12: వేలూరు పార్లమెంటు నియోకవర్గంలో మైక్రో అబ్జర్వర్ల శిక్షణ శిబిరం శుక్రవారం జరిగింది. శిబిరాన్ని ఎన్నికల సూపర్‌వైజర్ రూపేష్‌కుమార్, ఎన్నికల అధికారి, కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రారంభించారు. సత్తువాచేరి లో ఉన్న జేపీఎం కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జమా లు మొయిద్దీన్, ఉప రిజిస్ట్రార్ (జనరల్ సప్లై) పథకం స్వాతి తదితరులు పాల్గొన్నారు.

నీలగిరి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

● కేంద్ర మంత్రి ఎల్.మురుగన్

ప్యారీస్, ఏప్రిల్ 12: వెనుకబడిన నియోజకవర్గం నీలగిరి అభివృద్ధి తన లక్ష్యమని బీజేపీ అభ్యర్థి, కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ తెలిపారు. ఆయన ఊటీలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... నీలగిరి నియోజకవర్గంలో బీజేపీ విజయం ఖాయమైందని, ప్రధాని నరేంద్రమోదీ ప్రచారానికి వచ్చి వెళ్లిన అనంతరం తమ పార్టీ ఓటు బ్యాంకు గణనీయంగా పెరిగిందన్నారు. పదేళ్లుగా ఎంపీగా ఉన్న డీఎంకే అభ్యర్థి ఎ.రాజా నీలగిరి ప్రజలకు ఎలాంటి పథకాలు తీసుకురాలేదని, పోలీసులు తన వాహనాన్ని తనిఖీ చేస్తూ రాజా వాహనాన్ని మాత్రం పట్టించుకోవవడం లేదని మురుగన్ ఆరోపించారు.

పోలీసు జీపును ఢీకొన్న ప్రభుత్వ బస్సు

● కర్ణాటక పోలీసు అధికారి సహా ముగ్గురి మృతి



జీపును పరిశీలిస్తున్న పోలీసులు

పెరంబూర్, ఏప్రిల్ 12: కీళపెన్నాత్తూర్ సమీపంలో పోలీసు జీపును ప్రభుత్వ బస్సు ఢీకొన్న ఘటనలో కర్ణాటక పోలీసు అధికారి సహా ముగ్గురు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. కర్ణాటక రాష్ట్ర ప్రత్యేక పోలీసు విభాగ డిప్యూటీ కమాండెంట్ ప్రభాకర(50), ప్రత్యేక పోలీసు విభాగం అధికారి హేమంత్(42), కానిస్టేబుల్ విఠల్(35) సేలం జిల్లాలో లోక్‌సభ ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రత్యేక పోలీసు విభాగానికి చెందిన దినేష్, జయకుమార్ కూడా సేలంలో పనిచేస్తున్నారు. వీరు ఐదుగురు గురువారం సేలం నుంచి కాంచీపురానికి పోలీసు వాహనంలో వచ్చారు. అక్కడి ఆలయంలో స్వామి దర్శనం చేసకొని మళ్లీ సేలంకు తిరుగు ప్రయాణమయ్యారు. కిళపెన్నాత్తూర్ బైపాస్ రోడ్డు, ఎంజీఆర్ నగర్ జంక్షన్‌లో వస్తుండగా తిరువణ్ణామలై నుంచి చెన్నై వెళ్తున్న ప్రభుత్వ బస్సు అదుపుతప్పి పోలీసు వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో జీపు నుజ్జునుజ్జుకాగా, కమాండెంట్ ప్రభాకర్, దినేష్ తీవ్రగాయాలతో సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. గాయపడిన హేమంత్, జయకుమార్, విఠల్‌ను స్థానికులు రక్షించి తిరువణ్ణామలై ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో విఠల్ మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని తిరువణ్ణామలై ఎస్పీ కె.కార్తికేయన్ పరిశీలించారు. ఘటనపై కీళపెన్నాత్తూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డీఎంకే ప్రభుత్వంలో నలుగురు సీఎంలు ఈపీఎస్ విమర్శ

పెరంబూర్, ఏప్రిల్ 12: డీఎంకే ప్రభుత్వంలో నలుగురు ముఖ్యమంత్రులు ఉండడం వల్ల రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం లేదని ఎన్నికల ప్రచార సభలో ఎడప్పాడి పళనిస్వామి ఎద్దేవా చేశారు. నామక్కల్ నియోజకవర్గ అన్నాడీఎంకే అభ్యర్థి తమిళ్‌మణికి మద్దతుగా శుక్రవారం కాట్టుపాళయంలో జరిగిన ప్రచార సభలో పళనిస్వామి మాట్లాడుతూ... డీఎంకే ప్రభుత్వంలో సొంత గృహం కట్టుకోవాలనే కోరిక కలగా మిగిలిందన్నారు. విద్యుత్ చార్జీలు, నూలు ధరల పెంపుతో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతపడి వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. రాష్ట్రంలో మహిళలపై లైంగిక వేధింపులు అధికమవడంతో పాటు శాంతి భద్రతలు ప్రశ్నార్థకంగా మారాయని విమర్శించారు. కరోనా సమయంలోనూ నిత్యావసర వస్తువులు ధరలు పెరగకుండా తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కానీ, గత ఆరు నెలల కాలంలోనే బియ్యం కిలో రూ.15 పెరిగింది డీఎంకే ప్రభుత్వ పాలనలో అని తెలిపారు. స్టాలిన్ కుటుంబానికి చెందిన వారు నలుగురు ముఖ్యమంత్రులుగా చెలాయిస్తుండంతో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందన్నారు. ఎన్నికల హామీలు అమలుచేసిన డీఎంకే ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్నాడీఎంకే అనుకూలపవనాలు వీస్తున్నాయని, అధిక స్థానాలను కైవసం చేసుకుంటామని ఈపీఎస్ చెప్పారు.

అన్నాడీఎంకేను అణచివేయడం ఎవరి తరం కాదు

● మాజీ మంత్రి సెల్లూర్ రాజు

ప్యారీస్, ఏప్రిల్ 12: అన్నాడీఎంకేను అణిచివేయడం ఎవరి వల్లా కాదని మాజీ మంత్రి సెల్లూరు రాజు తెలిపారు. మదురై లోక్‌సభ నియోజకవర్గంలో అన్నాడీఎంకే అభ్యర్థికి మద్దతుగా మాజీ మంత్రి సెల్లూర్ రాజు శుక్రవారం ప్రచారం చేశారు. కేంద్రంలో అధికార బలం, ధనబలం ఉందన్న గర్వంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై అన్నాడీఎంకే గురించి నోటికొచ్చిందల్లా వాగుతున్నారన్నారు. పోలీసు ఉద్యోగం వదులుకొని రాజకీయాల్లోకి వచ్చిన అన్నామలై ఏదో సాధించాలన్న ఉద్దేశంతో అన్నాడీఎంకేను విమర్శిస్తున్నారని, చరిత్ర మీద అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో కొనసాగుతున్న బీజేపీ ప్రభుత్వం తమిళనాడుకంటూ ఏం మేలు చేయలేదని, ప్రస్తుతం బీజేపీలో దొంగలు చేరి దేశ సంపద దోచుకుంటున్నారని విమర్శించారు. అన్నాడీఎంకేతో చెలాగాటం ఆడడంతో తేనె తుట్టెలో వేలు పెట్టినట్లేనని, ఎందరో మహామహులు మట్టుబెట్టాలని యత్నించి కనుమరుగైపోయారని సెల్లూరు రాజు అన్నారు.

టీటీవీ దినకరన్ వలస పక్షి: ముత్తరసన్

ప్యారీస్, ఏప్రిల్ 12: అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం నేత టీటీవీ దినకరన్ వలస పక్షి లాంటి వారని, ఆయన చేరే కూటమి ఎన్నికల్లో గెలిచిన దాఖలాలు లేవని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ అన్నారు. తేని పార్లమెంటు నియోజకవర్గ డీఎంకే అభ్యర్థికి మద్దతుగా శుక్రవారం ప్రచారంలో పాల్గొన్న ముత్తరసన్.. ఉత్తర చెన్నైలోని ఆర్కేనగర్ శాసనసభ నియోజకవర్గం ఎన్నికల్లో స్థానికులకు రూ.20 నోటు అందజేసి, తాను గెలిచిన అనంతరం పెద్ద మొత్తం ముట్టచెబుతానని టీటీవీ దినకరన్ మోసం చేశారన్నారు. ఇదే తరహాలో ప్రస్తుతం తేని నియోజకవర్గ ఓటర్లకు కూడా తాయిలాల ఆశ చూపెడుతున్నారన్నారు. కేంద్రప్రభుత్వానికి మద్దతుగా నిలిచిన అన్నాడీఎంకే ప్రభుత్వం ప్రస్తుతం ఎన్డీఏ కూటమి నుంచి వైదొలిగిందని, అయినా అన్నాడీఎంకేకు వేసే ఓటు బీజేపీ ఖాతాలో చేరుతుందని, అందువల్ల ఓటర్లు ఆలోచించి డీఎంకే కూటమిని గెలిపించాలని ముత్తరసన్ విజ్ఞప్తి చేశారు.

నేడు 'వామ్' ఆధ్వర్యంలో మజ్జిగా పంపిణీ

చెన్నై, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): 'ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ' (వామ్) ఆధ్వర్యంలో శనివారం మెహతానగర్, వడగ్రహారంలోని వామ్ కార్యాలయం వద్ద మజ్జిగ పంపిణీ జరగనుంది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మజ్జిగ పంపిణీ వుంటుంది. వామ్ గ్లోబల్ నాయకుడు బండారు సుబ్బారావు ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారని వామ్ అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణ ప్రకటన విడుదల చేశారు.

మహాబలిపురంలో తయారైన భారీ మురుగన్ విగ్రహం

ఐసిఎఫ్, ఏప్రిల్ 12: తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణ మార్గంలో ఉన్న ఆలయంలో ప్రతిష్ఠించేందుకు 15 అడుగుల భారీ బాలమురుగన్ విగ్రహాన్ని మహాబలిపురం శిల్ప తయారీ శాల నుంచి గురువారం తరలించారు. హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయ గిరి ప్రదక్షిణ మార్గంలో కొత్తగా బాలమురుగన్ ఆలయాన్ని నిర్మించనున్నారు. అక్కడ ప్రతిష్ఠించేందుకు భారీ విగ్రహాన్ని మహాబలిపురం ప్రైవేటు శిల్పాల తయారీ కేంద్రంలో తయారు చేయించారు. నెమలి, సర్పంతో పాటు 15 అడుగుల ఎత్తు, 8 అడుగుల వెడల్పు, 3 అడుగుల ఎత్తున్న పీఠంతో విగ్రహాన్ని రూపొందించారు. ఆ విగ్రహాన్ని ప్రత్యేక పూజలు నిర్వహించి గురువారం తిరువణ్ణామలైకు తరలించారు.



మహాబలిపురం శిల్ప తయారీశాల నుంచి వాహనంలో తరలివెళ్తున్న విగ్రహం

రేపు దేవాంగ సంఘం కన్నికల గుడిలో ఉగాది వేడుకలు

చెన్నై, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): 'సర్ త్యాగరాయ కళాపరిషత్ ఉత్తర మద్రాసు ఉగాది మహోత్సవ కార్యనిర్వాహక వర్గం' ఆధ్వర్యంలో ఆదివారం పాతచాకలిపేట, నమశ్శివాయ వీధిలో వున్న దేవాంగ సంఘం కన్నికల గుడిలో క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు జరగనున్నాయి. సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కానున్న ఈ వేడుకల్లో ఎంఆర్ సుబ్రమణ్యం ప్రార్థనా గీతం ఆలపించనుండగా, సూరాతి బలరాం స్వాగతం పలకనున్నారు. శ్రీకృష్ణ గీతా సమాజం ఆధ్వర్యంలో గీతా పారాయణం, మానెల్లూరు శ్రీదేవి మాధవయ్య పంచాంగ పఠనం ఉంటుంది. అదే విధంగా చిన్నారుల విచిత్ర వేషధారణ పోటీలు, వినోద కార్యక్రమాలు ఉంటాయి. సూరాతి హనుమంతరావు అతిథులను పరిచయం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ పి.నందివర్మన్ అధ్యక్షత వహించనుండగా, ముఖ్య అతిథులుగా జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, తమిళనాడు తెలుగు వెలుగు సంఘ రాష్ట్ర అధ్యక్షులు అల్లిగం రాజశేఖర్, విశిష్ట అతిథిగా ప్రముఖ వాణిజ్యవేత్త కాట్నా శ్రీనివాసులు హాజరుకానున్నారు. సంఘం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన వక్తృత్వ, చిత్రలేఖన, ముగ్గులు, విచిత్ర వేషధారణ పోటీల విజేతలకు బహుమతి ప్రదానం జరగనుంది. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయవాది జక్కుల హరికృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించనుండగా, కాట్నా మోహనరంగయ్య వందన సమర్పణ చేయనున్నారు. చందూస్ నాట్యాలయం నేతృత్వంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు పేర్కొన్నారు.

17న శ్రీరామ నవమి మహోత్సవం

చెన్నై, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట తాలూకా కుమ్మరపేట గ్రామంలోని వెంకటేశ పెరుమాళ్ భజనమందిరంలో ఈనెల 17వ తేదీన ఉదయం శ్రీరామ నవమి మహోత్సవం జరగనుంది. అనంతరం ఈ నెల 29వ తేదీ వరకు వరుసగా ప్రత్యేక కార్యక్రమాలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమాలకు అందరూ ఆహ్వానితులేనని పెరుమాళ్ గుడి భక్తజన బృందం పేర్కొంది.

రూ.3 లక్షల విలువైన సెల్‌ఫోన్ల చోరీ

● అమెజాన్ ఉద్యోగి అరెస్ట్

పెరంబూర్, ఏప్రిల్ 12: స్థానిక విరుగంబాక్కంలోని అమెజాన్ షోరూంలో రూ.3 లక్షల విలువైన 5 సెల్‌ఫోన్లు అదృశ్యమైన వ్యవహారంలో షోరూం ఉద్యోగిని పోలీసులు విచారిస్తున్నారు. ఆర్కాడు రోడ్డులోని ఈ షోరూంలో ఐదు సెల్‌ఫోన్లు అదృశ్యం కావడాన్ని గుర్తించిన మేనేజర్ కార్తీక్, దుకాణంలోని సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించి షోరూమ్‌లో పనిచేస్తున్న పార్తీపన్ సెల్‌ఫోన్లు చోరీ చేసినట్లు గుర్తించారు. మేనేజర్ ఫిర్యాదుతో పార్తీపన్‌ను కేకే నగర్ పోలీసులు అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

మంత్రి ఉదయనిధి కారు తనిఖీ

పెరంబూర్, ఏప్రిల్ 12: మంత్రి ఉదయనిధి వాహనాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లకు నగదు, బహుమతులు అందజేయడాన్ని అడ్డుకొనేలా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. ఇక, డీఎంకే కూటమి అభ్యర్థులకు మద్దతుగా మంత్రి ఉదయనిధి రాష్ట్రవ్యాప్తంగా సుడిగాలి ప్రచారం చేపట్టారు. శుక్రవారం శంకరన్‌కోయిల్‌లో ప్రచారం ముగించుకొని వస్తున్న మంత్రి వాహనాన్ని తెన్‌కాశి జిల్లా కరట్టుమలై చెక్‌పోస్ట్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. ఎలాంటి వస్తువులు లేకపోవడంతో వాహనం వెళ్లాలని అధికారులు సూచించారు.

వర్షం కారణంగా అమిత్ షా పర్యటన రద్దు

పెరంబూర్, ఏప్రిల్ 12: పుదుకోటలో కురుస్తున్న వర్షం కారణంగా కేంద్ర మంత్రి అమిత్‌షా తిరుమయం పర్యటన రద్దయింది. అమిత్ షా ప్రత్యేక హెలికాప్టర్‌లో సాయంత్రం 5 గంటలకు తిరుమయం వస్తారని రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. కానీ, వర్షం కారణంగా మదురై నుంచి హెలికాప్టర్ బయల్దేరడంలో జాప్యం జరిగింది. అలాగే, తిరుమయం, పరిసర ప్రాంతాల్లో కూడిన వర్షం కురుస్తూ, హెలిక్టాపర్ ల్యాండ్ అయ్యేందుకు వాతావరణం అనుకూలించకపోవడంతో తిరుమయంలో అమిత్ షా పర్యటన రద్దయిందని బీజేపీ నేతలు తెలిపారు.

అన్నామలైపై కేసు నమోదు

ప్యారీస్, ఏప్రిల్ 12: కోవై లోక్‌సభ నియోకవర్గంలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి రాత్రి 10 గంటల తరువాత ప్రచారంలో పాల్గొన్న బీజేపీ అభ్యర్థి అన్నామలైపై పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం రాత్రి పీలమేడు తదితర ప్రాంతాల్లో అన్నామలై ప్రచారంలో పాల్గొన్నారు. చివరగా ఆయన ఆవారంపాళయంలో ప్రచారానికి వెళ్లేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. ఆ మేరకు ఆయన ప్రచార వాహనంలో రాత్రి 10 గంటలు దాటిన తర్వాత అక్కడకి వెళ్లడంతో డీఎంకే నిర్వాహకులు అభ్యంతర వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, నిబంధనలు ఉల్లఘించి ప్రచారంలో పాల్గొన్న అన్నామలైపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మేల్‌మరువత్తూర్‌లో చిత్రా పౌర్ణమి వేడుకలు ప్రారంభం



యాగశాల పూజలు ప్రారంభిస్తున్న పూజారులు

ప్యారీస్, ఏప్రిల్ 12: చెంగల్పట్టు జిల్లా మేల్‌మరువత్తూర్ ఆదిపరాశక్తి ఆలయంలో ఈ నెల 23వ తేది చిత్రా పౌర్ణమి పర్వదినాన వర్షాలు కురవాలని, ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని 1,008 యాగ గుండాల్లో కలశ దీప పూజలు నిర్వహించనున్నారు. ఈ పూజలు విజయవంతం కావాలని కాంక్షిస్తూ శుక్రవారం యాగశాల పూజలను లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున 4 గంటలకు గురుపూజ, విఘ్నేశ్వర పూజ, శక్తి పూజలన శాస్త్రోక్తంగా నిర్వహించారు. మేరు చక్రం, పంచ దైవ చక్రం, అడిగళార్ చక్రం పేర్లతో యాగగుండాల ఏర్పాటుకు ఈ సందర్భంగా శ్రీకారం చుట్టారు. చిత్రా పౌర్ణమి రోజున భక్తుల సౌకర్యార్థం రాష్ట్రప్రభుత్వ రవాణా సంస్థలు మేల్‌మరువత్తూర్‌కు ప్రత్యేక బస్సులు నడుపుతాయని ఆదిపరాశక్తి ఆధ్యాత్మిక సంస్థ ఉపాధ్యక్షులు అన్బళగన్, సెంథిల్‌కుమార్ తెలిపారు.

వేసవి ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, ఏప్రిల్ 12: వేసవి సెలవులను పురస్కరించుకొని ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

● నెం.06507 బెంగళూరు - ఖరగ్‌పూర్ ప్రత్యేక రైలు ఈనెల 12, 19, 26, మే 3, 10, 17(శుక్రవారం) తేదీల్లో బెంగళూరులో మధ్యాహ్నం 3.50 గంటలకు బయల్దేరి మూడో రోజు వేకువజామున 2.45 గంటలకు ఖరగ్‌పూర్ చేరుకుంటుంది. మరోమార్గంలో నెం.06508 ఖరగ్‌పూర్ - బెంగళూరు ప్రత్యేక రైలు ఈనెల 15, 22, 29, మే 6, 13, 20 (సోమవారం) తేదీల్లో ఖరగ్‌పూర్‌లో మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 7.50 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. ఈ రైలు కృష్ణరాజపురం, బంగారుపేట, కుప్పం, జోలార్‌పేట, కాట్పాడి, రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, సింహాచలం నార్త్, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బరంపురం, ఖుర్దా రోడ్డు, భువనేశ్వర్, కటక్, భద్రక్, బాలాసూర్ స్టేషన్లలో ఆగుతాయి.



వేలూరు నియోజకవర్గ డీఎంకే అభ్యర్థి కదిర్ ఆనంద్‌కు మద్దతుగా శుక్రవారం బాగాయం, తొరప్పాడి ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి దురైమురుగన్, ఎమ్మెల్యే నందకుమార్ తదితరులు

● ప్రచారంలో పదనిసలు



పూలు అల్లుతున్న సెంట్రల్ చెన్నై నియోజకవర్గ డీఎండీకే అభ్యర్థి పార్థసారథి



కోయంబత్తూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి అన్నామలైకు మద్దతుగా చేపట్టిన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓటరుకు మిఠాయి తినిపించి ఓట్లు అభ్యర్థిస్తున్న డాన్స్ మాస్టర్ కళ



కోయంబత్తూర్‌లో ప్రచారంలో భాగంగా చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా బిషప్ తిమోతి రవీందర్‌దేవ్ ప్రదీప్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న బీజేపీ అభ్యర్థి అన్నామలై



చెన్నై మెరీనా బీచ్‌లో శుక్రవారం ఎన్నికల అవగాహన ప్రచారంలో భాగంగా పారా గ్లైడింగ్‌లో జిల్లా ఎన్నికల అధికారి జె.రాధాకృష్ణన్



పొలాల్లో కలుపు తీస్తున్న ధర్మపురి నియోజకవర్గ పీఎంకే అభ్యర్థి సౌమ్య అన్బుమణి

కన్నియాకుమారిలో

సార్వత్రిక సమరం

ఎగిరే జెండా ఎవరిదో...?



తమిళనాడు దక్షిణ సరిహద్దు జిల్లా కన్నియాకుమారి. సూర్యోదయం, సూర్యాస్తమయం ఒకేచోట చూడగలిగిన పర్యాటక ప్రాంతంగా ప్రపంచ చిత్రపటంలో చోటు దక్కించుకుంది. ప్రకృతి అందాలు సంతరించుకున్న ఈ పార్లమెంటు నియోజకవర్గం ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతోంది. మరోవైపు సముద్రం మధ్య నిర్మించిన వివేకానంద మండపం, భారీస్థాయి తిరువళ్లువర్ శిలా విగ్రహం ఈ జిల్లాకు ఘనత చేకూర్చాయి. ప్రసిద్ధిగాంచిన రాజకీయ నేతలు, కవులు, సాహితీవేత్తలు, సినీ కళాకారులను అందించిన కన్నియాకుమారి చరిత్ర ఘనం.

- ప్యారీస్



విజయ్ వసంత్



పొన్.రాధాకృష్ణన్



బసలియాన్ నజరేత్

కామరాజర్ గెలిచిన స్థానం...

రాజకీయాల్లో మచ్చలేని నేతగా రాణించి చరిత్రలో నిలిచిపోయిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కామరాజర్ 1967లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తన సొంత నియోజకవర్గమైన విరుదునగర్‌లో పోటీ చేసి విజయావకాశాన్ని కోల్పోయారు. 1969లో నాగర్‌కోయిల్ పేరుతో ఉన్న లోక్‌సభ నియోజకవర్గ ఎంపీ మార్షల్ నేశమణి మృతి చెందడంతో జరిగిన ఉపఎన్నికలో పోటీ చేసి కామరాజర్ తొలిసారిగా ఎంపీగా గెలిచి పార్లమెంటులో అడుగుపెట్టారు. ఆ తర్వాత 1971లో జరిగిన లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో రెండో సారి అత్యధిక మెజార్టీతో గెలిచారు. కాంగ్రెస్, బీజేపీల కంటూ ప్రత్యేక ఓటు బ్యాంక్ కలిగిన ఈ స్థానంలో ప్రాంతీయ పార్టీల ఓటు బ్యాంకు తక్కువే. 2009వ సంవత్సరం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కన్నియాకుమారిలో కాంగ్రెస్ అభ్యర్థి హెచ్.వసంత్‌కుమార్ గెలిచారు. కరోనా మహమ్మారికి గురై మృతిచెందడంతో రెండేళ్లకే జరిగిన ఉప ఎన్నికలో ఆయన కుమారుడు విజయ్ వసంత్ పోటీ చేసి నెగ్గారు.

ఆరు అసెంబ్లీ స్థానాలు...

మొత్తం ఓటర్లు:	15,57,915
పురుషులు:	7,77,484
మహిళలు:	7,80,288
ఇతరులు:	143

నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2009వ సంవత్సరం జరిగిన సార్వత్రిక ఎన్నికల ముందు వరకు కన్నియాకుమారి జిల్లాలో కన్నియాకుమారి, నాగర్‌కోయిల్, కుళచ్చల్, పద్మనాభపురం, తిరువట్టార్, విలవంగోడు, కిల్లియూర్ అనే 7 నియోజకవర్గాలుండేవి. వీటిలో కన్నియాకుమారి

● వీఐపీ నియోజకవర్గం

అసెంబ్లీ స్థానం తిరుచెందూర్ లోక్‌సభ నియోకెవర్గంలో విలీనం చేశారు. పోగా 7 అసెంబ్లీ స్థానాలతో నాగర్‌కోయిల్ పార్లమెంటు చేశారు. నియోజకవర్గ పునర్విభజన సమయంలో తిరువట్టార్ అసెంబ్లీ స్థానాన్ని రద్దు చేశారు. ఆ తర్వాత కన్నియకుమారి పార్లమెంటు స్థానంగా స్థిరపడింది. ప్రస్తుతం కన్నియాకుమారి, నాగర్‌కోయిల్, కుళచ్చల్, పద్మనాభపురం, విలవంగోడు, కిల్లియూర్ అనే 6 అసెంబ్లీ స్థానాలు కన్నియాకుమారి పార్లమెంటు నియోజకవర్గంలో ఉన్నాయి.

2021 ఉపఎన్నిక ఫలితాలు..

2021వ సంవత్సరం కన్నియాకుమారి పార్లమెంటు స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ తరఫున విజయ్ వసంత్ విజయవసంత్ విజయ్‌వసంత్ 5,76,037 ఓట్లు రాబట్టుకోగా, బీజేపీ అభ్యర్థి పొన్.రాధాకృష్ణన్ 4,38,087 ఓట్లు పొంది ద్వితీయ స్థానంలో నిలిచాడు.

కాంగ్రెస్ కోట...

1957వ సంవత్సరం నుంచి 2021 వరకు 18 సార్లు ఎన్నికలు జరిగిన నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ 11 సార్లు విజయం సాధించి రికార్డు నెలకొల్పింది. తమిళ మానిల కాంగ్రెస్, బీజేపీ తలా రెండు సార్లు, స్థాపన కాంగ్రెస్, సీపీఎం, డీఎంకేలు తలా ఒక సారి గెలిచాయి.

నెరవేరని కోరికలు...

మేలురకమైన రబ్బరు ఉత్పత్తిలో ప్రత్యేక గుర్తింపు పొందిన కన్నియాకుమారి జిల్లాలో రబ్బరు ఫ్యాక్టరీ, రబ్బరు టెక్నికల్ పార్కు ఏర్పాటు చేయాలని ప్రజల దీర్ఘకాలిక కోరిక. దిగుబడి అవుతున్న రబ్బరుకు గిట్టుబాటు ధర, సెంటు ఫ్యాక్టరీ, పూల సంత, కార్మిక సంక్షేమ బోర్డులు స్థానిక ప్రజల డిమాండ్. ప్రధానంగా స్వదేశీ, విదేశీ పర్యాటకులు పెద్ద సంఖ్యలో వచ్చి వెళుతుంటారు. కన్నియాకుమారిలో విమానాశ్రయం, ఏవీఎం నదీ కాలువలో పడవ రవాణా, కొబ్బరి ఫ్యాక్టరీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ఏ జెండా ఎగురుతుందో?

కన్నియాకుమారి నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున రెండో సారి విజయ్ వసంత్, బీజేపీ అభ్యర్థిగా కేంద్ర మాజీమంత్రి పొన్.రాధాకృష్ణన్, అన్నాడీఎంకే తరఫున బసలియాన్ నజరేత్ పోటీ చేస్తున్నారు. వీరితో పాటు మరో 22 మంది స్వతంత్రులు ఎన్నికల బరిలో ఉన్నారు.

వినోజ్ కోసం..

108 శూలాలు గుచ్చుకుని ప్రచారం



వినోజ్ వెంట శూలాలతో ప్రచారం చేస్తున్న అభిమాని

చెన్నై, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 'వీరాభిమానం' గురించి కొత్తగా చెప్పాల్సిన పని లేదు. తాము నమ్మిన నేతల కోసం తమ ప్రాణాలు సైతం అర్పించేందుకు సిద్ధంగా ఉండే కార్యకర్తలెందరో ఉన్నారు. ఆ కోవకు చెందిన ఓ బీజేపీ కార్యకర్త సెంట్రల్ చెన్నై బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం కోసం తన శరీరమంతా 108 శూలాలు గుచ్చుకుని వీధివీధినా తిరుగుతూ ప్రచారం చేపట్టారు. వినోజ్ పి.సెల్వంవెంట వచ్చిన అతన్ని చూసిన ప్రజలు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఆయన ప్రచారం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వినోజ్ పి.సెల్వం మీడి యాతో

● వీరాభిమానం

మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అమలు చేస్తున్న విధానాలతో కోట్లాదిమంది ప్రజలు వీరాభిమానులుగా మారిపోయారన్నారు. తాను ఎక్కడికెళ్లినా ప్రజలు ఎంతో ఆప్యాయంతో ఆదరిస్తున్నారని, తమ పార్టీ పట్ల అభిమానం చూపుతున్నారని వివరించారు. ఎన్నికల్లో తన గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రత్యేకించి యువకులు, మహిళలు, వృద్ధులు తమ పట్ల ఎంతో ఆదరణ చూపుతున్నారని వినోజ్ పేర్కొన్నారు.

బంగారం పెరుగుదలకు కేంద్రమే కారణం

● మంత్రి ఉదయనిధి

చెన్నై,ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పేదలకు, మధ్యతరగతి ప్రజలకు అందనిరీతిలో బంగారం ధరలు రాకెట్ వేగంతో పెరుగుతుండడానికి కేంద్ర ప్రభుత్వమే కారణమని డీఎంకే యువజన విభాగ నాయకుడు, రాష్ట్ర మంత్రి ఉదయనిధి అన్నారు. తెన్‌కాశిలో డీఎంకే అభ్యర్థి రాణి శ్రీకుమార్‌కు మద్దతుగా శుక్రవారం మధ్యాహ్నం ఆయన ఓపెన్‌టాప్ వ్యాన్‌పై నిలిచి ప్రచారం చేస్తుండగా ఆ ప్రాంతం వద్ద గుమికూడిన మహిళలు 'అయ్యా బంగారం అందనంత ధరకు పెరి

● మరి కూరగాయల ధరలకు...

గింది తగ్గించలేరా?'అని ఆయన్ను ప్రశ్నించారు. ఉదయనిధి బదులిస్తూ బంగారం ధర పెరగటానికి రాష్ట్రంలోని డీఎంకే ప్రభుత్వానికి ఏ మాత్రం సంబంధంలేదని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని ఉంటే బంగారు ధరలు ఇంతగా పెరిగేది కాదన్నారు. ఒకరిద్దరు మహిళలు తమకు కలైంజర్ సాధికారిక నగదు అందటం లేదని ఫిర్యాదు చేశారు. ఎన్నికలు ముగిసిన తర్వాత అర్హులైన గృహిణులకు కొత్తగా ఎంపిక చేసి నగదును పంపిణీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.



తెన్‌కాశిలో ప్రచారం చేస్తున్న మంత్రి ఉదయనిధి

● హిందీ పాట్లు

తేనిలో సినీ హీరో కార్తీక్ హిందీలో ఓట్ల వేట



ఆండిపట్టి వద్ద ప్రచారం చేస్తున్న నటుడు కార్తీక్

చెన్నై, ఏప్రిల్ 12 (ఆంధ్ర జ్యోతి): అన్నాడీ ఎంకే కు మద్దతుగా ప్రచారం చేస్తున్న ప్రముఖ తమిళ సినీ నటుడు కార్తీక్ ఉన్నట్టుండి హిందీలో ప్రసంగించి రెండాకుల గుర్తుకు ఓటేసి గెలిపించాలంటూ విజ్ఞప్తి చేశారు. గురువారం రాత్రి ఆయన తేని జిల్లా ఆండిపట్టిలో అన్నాడీఎంకే అభ్యర్థి వీటీ నారాయణస్వామికి మద్దతుగా ప్రచారం చేశారు. ఓపెన్‌టాప్ వ్యాన్‌పై నిలిచి ప్రసంగిస్తూ తనకు హిందీ భాష వచ్చునని, ఆ భాషలో మాట్లాడమంటారా అని గుమికూడిన జనాన్ని అడిగారు. అందుకు చాలా మంది హిందీలో భేషుగ్గా మాట్లాడవచ్చునని చెప్పారు. దీంతో కార్తీక్ గబగబా హిందీలో మాట్లాడుతూ అన్నాడీఎంకేని గెలిపించమని అభ్యర్థించారు. కార్తీక్ హిందీలో చేసిన క్లుప్త ప్రసంగానికి జనం చప్పట్లు చరిచింది.

● పోలికలో తేడా

కుక్కర్‌ను చూస్తే మా ఆయన ముఖం గుర్తుకు రావాలి



ప్రచారం చేస్తున్న దినకరన్ సతీమణి అనురాధ

చెన్నై, ఏప్రిల్ 12 (ఆంధ్ర జ్యోతి): మదురై జిల్లా ఉసిలంపట్టిలో అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం అధ్యక్షుడు టీటీవీ దినకరన్‌కు మద్దతుగా ఆయన సతీమణి అనురాధ ప్రచారం చేశారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆర్కేనగర్‌లో తొలిసారిగా పోటీ చేసిన తన భర్తకు విజయాన్ని అందించింది కుక్కర్ చిహ్నమేనని చెప్పారు. ఈ ఎన్నికల్లో ఇంట్లో ఉన్న కుక్కర్‌ను చూడగానే గృహిణులందరికీ తన భర్త దినకరన్ ముఖం గుర్తురావాలని చెప్పారు. తన భర్త దినకరన్ ముఖంగా కూడా కుక్కర్‌లాగే బొద్దుగా ఉంటుందని ఆమె చెప్పగానే హాజరైన జనమంతా నవ్వుతూ చప్పట్లు కొట్టారు.

వాళ్లంతా ఒ.పన్నీర్‌సెల్వంలు... నేనే ఓ..ఓ ఒ.పన్నీర్‌సెల్వంను



అరంతాంగి వద్ద ప్రచారం చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం

● పేరు తెచ్చిన తంటా

● ఓపీఎస్

చెన్నై, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం నియోజకవర్గంలో తన పేరుతో పోటీ చేస్తున్న వారంతా ఒ.పన్నీర్‌సెల్వంలేనని, తాను మాత్రమే ఓ..ఓ... పన్నీర్‌సెల్వం అంటూ మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) అన్నారు. ఎన్డీయే కూటమి తరఫున రామనాథపురంలో ఇండిపెండెంట్‌గా పనసపండు గుర్తుపై ఆయన పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఆయన పేరు కలిగిన ఐదుగురు స్వతంత్రులు పోటీలో ఉన్నారు. తన రాజకీయ ప్రత్యర్థులే తన పేరు కలిగిన వ్యక్తులను వెదికిపట్టి తీసుకొచ్చి పోటీకి దింపారని వాపోయారు. ఈ ఎన్నికల్లో గెలిచి తన సత్తాను చాటుకుంటానని చెప్పారు. ఎన్నికల సంఘం వద్ద తాను ఏయే గుర్తులు కావాలని కోరానో తన పేరున్న అభ్యర్థులు కూడా అవే చిహ్నాల కోసం పట్టుబట్టారని, దీన్ని బట్టి అన్నాడీఎంకేలోని తన ప్రత్యర్థులే తన ఓటమి కోసం ఇలాంటి చేష్టలకు పాల్పడ్డారని ఓపీఎస్ ధ్వజమెత్తారు.

కోవైనుంచి ఆధ్యాత్మిక క్షేత్రాలకు 10 రైళ్లు

● సరికొత్త హామీ

చెన్నై, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య నగరం కోయంబత్తూరు నుంచి దేశంలోని సుప్రసిద్ధ పది ఆధ్యాత్మిక క్షేత్రాలకు ప్రత్యేక రైళ్లను నడిపేందుకు చర్యలు చేపడతానంటూ ఆ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి అన్నామలై హామీ ఇచ్చారు. శుక్రవారం ఉదయం ఏర్పాటైన ప్రత్యేక సభలో ఆయన కోవై నియోజకవర్గానికి ప్రత్యేకంగా రూపొందించిన ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. పచ్చదనానికి దూరమవుతున్న కోయంబత్తూరు వ్యాప్తంగా ఉద్యమ స్ఫూర్తితో విరివిగా చెట్లు నాటే కార్యక్రమాలు చేపట్టనున్నామని, పల్లడం ప్రాంతాన్ని దుస్తుల ఎగుమతి మండలిగా ప్రకటించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తానని, ఎంపీగా ఎంపికైతే 5 వందల రోజుల్లోగా వంద హామీలను నెరవేరుస్తానని ప్రకటించారు. శరవణంపట్టిలో ఉద్యానవనం, అదే ప్రాంతంలో అమృత్ పథకం కింద బస్‌స్టేషన్, కోయంబత్తూరులో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం), యేడాదిన్నర లోపున 250 ప్రజా మందుల దుకాణాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆ మేనిఫెస్టోలో పేర్కొన్నారు.



మేనిఫెస్టోను విడుదల చేస్తున్న అన్నామలై

● నిగ్గదీసి అడుగు



ఇంటికొకరికి ఉద్యోగం ఎలా ఇస్తారు?

● అన్నామలైను ప్రశ్నించిన నటి వింధ్య

ప్యారీస్, ఏప్రిల్ 12: తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉంటూ నిరుద్యోగులను పట్టించుకోని బీజేపీ ప్రభుత్వం, మళ్లీ మూడో సారి గెలిస్తే ఇంటికొకరికి ఉద్యోగాలిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందంటూ సినీ నటి వింధ్య బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైకు కౌంటర్ ఇచ్చారు. అన్నాడీఎంకే స్టార్ క్యాంపెనర్లలో ఒకరైన వింధ్య ప్రచారంలో భాగంగా అన్నామలై గురించి మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. అందులో... 'అన్నామలై చెబుతున్నారు మేము మూడో సారి కేంద్రంలో అధికారంలోకి వస్తే ఇంటికి ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని, అదేదో ఉత్తరాది రాష్ట్రాల్లో ఇవ్వొచ్చు కదా? ప్రస్తుతం ఉత్తరభారతంలో సుమారు 15 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ నిరుద్యోగులను పట్టించుకోలేదు. ఈ పరిస్థితుల్లో తమిళనాడులో ఇంటికొకరికి ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పడం వింతే' కదా అని దెప్పిపొడిచారు.

ఓటేయండి... లక్ష రుణం పొందండి

● మీరు కట్టొద్దు... మేమే తీరుస్తాం

● పొల్లాచ్చిలో బీజేపీ వినూత్న ప్రచారం

● నిజమేనా?!

ప్యారీస్, ఏప్రిల్ 12: కోయంబత్తూర్ జిల్లా పొల్లాచ్చి లోక్‌సభ నియోకవర్గంలో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి వసంతరాజన్ చేపట్టిన ప్రచారం వినూత్నంగా ఉంది. ఆయన స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలసి నియోజకవర్గంలోని ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఈ నేపథ్యంలో, కినత్తుకడవు ప్రాంతంలో ప్రచారంలో పాల్గొన్న ఆయన, 'కమలం గుర్తుకు కచ్చితంగా ఓటు వేస్తామని హామీ ఇచ్చిన వారికి ఎస్బీఐలో రూ.లక్ష రుణం ఇప్పిస్తాం, ఆ లోన్ మీరు కట్టాల్సిన అవసరం లేదు. ఎన్నికల్లో మళ్లీ బీజేపీ మూడో సారి గెలిస్తే ఈ హామీ తప్పక నెరవేరుస్తా' అని ప్రజలకు తెలుపుతూ వసంతరాజన్ ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

గుండెపోటుతో నటుడు అరుళ్‌మణి మృతి



అరుళ్‌మణి (ఫైల్‌ఫొటో)

ప్రముఖ నటుడు, క్యారెక్టర్ ఆర్టిస్ట్, విలన్ అరుళ్‌మణి (65) గుండెపోటుతో గురువారం మృతిచెందారు. ఆయనకు గుండెపోటు రావడంతో హుటాహుటిన స్థానిక రాయపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. అక్కడ నుంచి స్థానిక సైదాపేటలో ఉన్న ఆయన నివాసానికి పార్థివదేహాన్ని తరలించి, సినీ ప్రముఖుల సందర్శనార్థం ఉంచారు. అంత్యక్రియలను శుక్రవారం పూర్తి చేశారు. కాగా, తమిళంలో 'పొన్‌మణి', 'ధర్మశీలన్', 'కరుప్పు రోజా', 'అళగి', 'వేల్' సహా సుమారుగా 90కి పైగా చిత్రాల్లో నటించారు. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, ప్రతినాయకుడిగా ఇలా అనేక పాత్రలను పోషించారు. నటుడిగా రాణిస్తూనే, డ్యాన్స్ అండ్ డైరెక్షన్ స్కూల్‌ను స్థాపించారు. అన్నాడీఎంకే స్టార్ క్యాంపెయినర్లలో ఒకరు. లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే తరఫున ఆయన గత పది రోజులుగా కూటమి అభ్యర్థుల కోసం ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. విశ్రాంతి కోసం ఆయన చెన్నైకి రాగా, గుండెపోటుతో మృతి చెందారు. కాగా, ఆయన చివరగా తిరుచ్చిలో జరిగిన అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పాల్గొన్న బహిరంగ సభలో పాల్గొన్నారు. అరుళ్‌మణి మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు, అన్నాడీఎంకే నేతలు తమ ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని వ్యక్తం చేశారు.

చిత్రజ్యోతి

సముద్రఖని హీరోగా 'మిస్టర్ మాణిక్యం'

ప్రముఖ విలక్షణ నటుడు, సినీ దర్శకుడు సముద్రఖని ప్రధానపాత్రలో 'మిస్టర్ మాణిక్యం' పేరుతో రూపొందుతోంది. ఈ చిత్రంలో నాజర్ ముఖ్య పాత్రను పోషించారు. 'సీతారామం' ఫేం విశాల్ చంద్రశేఖర్ సంగీత స్వరాలు సమకూర్చే ఈ చిత్రానికి బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కంపోజింగ్ పనులు తాజాగా ప్రారంభమయ్యాయి. గేయ రచయితలు స్నేహన్, రాజు మురుగన్, ఇళంగో కృష్ణన్, సర్గో సాహిత్యాన్ని అందించారు. 'రష్మీ రాకెట్' అనే చిత్రం ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపును సొంతం చేసుకున్న నంద పెరియస్వామి ఈ మూవీకి కథను సమకూర్చి దర్శకత్వం వహిస్తున్నారు. కేరళ రాష్ట్రంలోని కుములి, మూనార్, మేఘమలై, తేక్కడి వంటి పలు అందమైన లోకేషన్లలో సినిమా షూటింగ్ జరిగింది. మైనా సుకుమార్ కెమెరామెన్. ప్రతి ఒక్కరి మనస్సాక్షిని ప్రశ్నించే చిత్రంగా ఈ సినిమా ఉంటుందని దర్శకుడు నంద పెరియస్వామి అంటున్నారు. జీపీఆర్‌కే సినిమాస్ పతాకంపై నిర్మించే ఈ చిత్రానికి నిర్మాతలు జీపీ రేఖా రవికుమార్, చింతా గోపాలకృష్ణా రెడ్డి, రాజా సెంథిల్.



'మిస్టర్ మాణిక్యం'లో నాజర్ తదితరులు

హృదయాన్ని కదిలించే కథతో 'కురంగు పెడల్'

హీరో శివకార్తికేయన్ సొంత నిర్మాణ సంస్థ శివకార్తికేయన్ ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రం 'కురంగు పెడల్'. హృదయాన్ని కదలించే చిత్రంగా దర్శకుడు కమలకన్నన్ తెరకెక్కిస్తున్నారు. రాష్ట్రంలోని సేలం, ఈరోడ్ జిల్లాల్లో మంత్రముగ్ధులను చేసే కావేరీ నదీతీరంలో 1980 కాలం నాటి వేసవిలో ఉండే ప్రజల జీవన స్థితిగతులపై ఈ సినిమా స్క్రిప్టు సాగుతుంది. సైక్లింగ్‌లో ప్రావీణ్యం సంపాదించడానికి ప్రయత్నిస్తున్న మారియప్పన్‌కు, అతని తండ్రి మధ్య ఉన్న బంధాన్ని తెలిపేలా ఉంటుంది. ఈ చిత్రానికి జిబ్రాన్ సంగీతం అందిస్తున్నారు. సంతోష్ వేలుమరుగన్, వీఆర్ రాఘవన్‌తో పాటు జ్ఞానశేఖర్, రతీష్, సాయి గణేష్ ప్రధాన పాత్రలను పోషిస్తున్నారు. 15 యేళ్లకు పైగా అనుభవం ఉన్న పీడియాట్రిక్ నిపుణుడు నంద కుమార్ ఈ యువ ప్రతిభావంతులకు 45 రోజుల పాటు నటన శిక్షణ ఇచ్చారు. వీరితో పాటు టాలెంటెడ్ యాక్టర్ కాళీ వెంకట్ కీలకమైన తండ్రి పాత్రను పోషిస్తున్నారు. ఈ యేడాది ప్రేక్షకుల ముందుకు వచ్చే ఈ చిత్రానికి నిర్మాతలు శివకార్తికేయన్, సవిత షణ్ముగం, సుమీ భాస్కరన్.



'కురంగు పెడల్'లో ఓ దృశ్యం

దిక్సూచి DIKSUCHI

మంచోడని మన గురించి నలుగురూ చెప్పుకోవాలని అనుకోవడం సర్వ సాధారణం. సగటు మానవుడి సాధారణ కోర్కెగా కూడా దీన్ని చెప్పుకోవచ్చు. అయితే దీనికి సంబంధించిన ఆధునిక రూపమే లెటర్ ఆఫ్ రికమెండేషన్(ఎల్ఓఆర్). ఇక్కడ కాన్సెప్ట్ మంచోడని కాదు, విదేశీ విద్యా సంస్థలో సీటుకు అర్హుడు అని సిఫార్సు చేయాల్సి ఉంటుంది. అది తను చదువుకున్న సంస్థకు చెందిన ప్రొఫెసర్ల వంటి వారు అన్నమాట. మరీ ముఖ్యంగా విదేశాల్లో చదువుకోవాలంటే అవసరమైన పత్రాల్లో ఇది కీలకమైనది అని కూడా చెప్పవచ్చు.



విదేశాల్లో చదువుకు కీలకం
లెటర్ ఆఫ్ రికమండేషన్

విదేశాల్లో చదవాలని భావించే అభ్యర్థి కేరెక్టర్, డెడికేషన్, అకడమిక్ ఆప్టిట్యూడ్‌కి సంబంధించి విలువైన విషయాలను ఈ లెటర్ తెలియజేస్తుంది. కాలేజీ ప్రొఫెసర్లు, ఎంప్లాయర్లు మెంటార్లు, విభాగాధిపతులు ఇచ్చే ఈ లెటర్లతో అభ్యర్థి క్రెడిబిలిటీ పెరుగుతుంది, పోటీతత్వం కూడా తెలుస్తుంది. స్ట్రక్చర్డ్ ఫార్మేట్‌కు తోడు సరైన ఉదాహరణలతో ఉండే లెటర్ ఒక వ్యక్తి స్థిరత్వం తదితరాలను తెలియజేస్తుంది. అకడమిక్ కెరీర్‌లో అభ్యర్థి సాధించిన గ్రేడ్స్, క్రెడిట్స్‌కు మించిన విషయాలు ఈ లెటర్‌లోనే వెల్లడి అవుతాయని కూడా చెప్పవచ్చు. కోరుకున్న కోర్సులో సీటు లభించేందుకు తోడ్పడుతుంది. అభ్యర్థికి ఉన్న విశ్వసనీయత, పోటీతత్వాన్ని పెంచడం ద్వారా సీటు పొందడానికి ఉన్న అవకాశాలు పెరుగుతాయి. పొందికగా తీర్చిదిద్దిన లెటర్ ఆఫ్ రికమండేషన్ నిజానికి విదేశాల్లో చదవాలని ఆకాంక్షించే అభ్యర్థి లక్ష్య సాధనలో ఇతోధికంగా తోడ్పడుతుంది.

ఎవరితో... ఎందుకు

లెటర్ ఆఫ్ రికమండేషన్‌ను ఎవరితో రాయించుకోవాలి అన్నది ఒక ప్రశ్న. వివిధ వర్గాల ద్వారా సమీకరించిన సమాచారాన్ని మదించుకుని మరీ ఆ వ్యక్తిని ఎంపిక చేసుకోవాలి. అలా సిఫార్సు చేయించుకోదగ్గ వ్యక్తుల్లో ప్రొఫెసర్ల నుంచి డిపార్ట్‌మెంట్ హెడ్ లేదా డీన్, ఉద్యోగం చేసి ఉంటే ఎంప్లాయర్, పరిశోధన పర్యవేక్షకుల వరకు అందరూ వస్తారు. మెంటార్లు, కోచ్‌లు, గైడెన్స్ కౌన్సెలర్లను కూడా పరిగణనలోకి తీసుకోవచ్చు. అభ్యర్థి నాయకత్వ పటిమ, టీమ్ వర్క్, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన విషయాలను విస్తారంగా, విపులంగా, వివరంగా వీరు మాత్రమే ప్రస్తావించగలుగుతారు.

అకడమిక్, నాన్ అకడమిక్ అంశాల సమ్మిళితంగా ఉన్న రికమండేషన్ లెటర్, అభ్యర్థికి ఉన్న సామర్థ్యాలను సమగ్రంగా తెలియజేయగలుగుతుంది. రికమండ్ చేసే ప్రతి వ్యక్తి తనదైన కోణంలో అభ్యర్థి సదరు కోర్సు చేసేందుకు ఎలా, ఎందుకు అర్హుడో తెలియజేస్తారు. లెటర్ మాత్రం వ్యక్తిని ఉద్దేశించి అంటే పర్సనలైజ్డ్ వ్యవహారంగా ఉన్నప్పుడు మాత్రమే పోటీలో ఎల్ఓఆర్ యూనిక్‌గా కనిపిస్తుంది. చివరగా అది అభ్యర్థిత్వానికి ఒక విద్యాసంస్థ ఓకే చెప్పడానికి బలమైన ప్రాతిపదికగానూ మారుతుంది.

కరెక్ట్ ఫార్మేట్

ఈ లెటర్‌కు సంబంధించినంతవరకు కోర్ ఎలిమెంట్ అంతా ఒక్కటే. ఒక అభ్యర్థి సీటు పొందేందుకు అవసరమైన సిఫార్సు అందులో ఉంటుంది. అయితే కోర్సును బట్టి చిన్నపాటి మార్పులు లెటర్ రాసే తీరులో ఉంటుందని గమనించాలి. ఫార్మేట్, సిఫార్సు చేసే వ్యక్తి - అందుకునే వ్యక్తి కాంటాక్ట్ సమాచారం తదితరాలు యథాతథం. లెటర్‌ను ఉద్దేశించిన వ్యక్తిని గౌరవప్రదంగా సంబోధించడం సహా సాధారణ విషయాలకు తోడు అందులోని కంటెంట్ అభ్యర్థితో తనకు ఉన్న సంబంధాన్ని తెలియజేయాలి. తనకు ఎంత కాలం నుంచి తెలుసు, ఇద్దరి మధ్య ఉన్న బాండింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ఒకరకంగా అభ్యర్థి వ్యక్తిగత విషయాలకు సంబంధించి తనది భరోసా అన్న విధంగా ఉండాలి.

లెటర్ బాడీలో అభ్యర్థి అర్హతలు, సాధించిన విజయాలు, సంబంధిత అనుభవం, కోర్సులో చేర్చుకునేందుకు అర్హుడు అంటూ తెలియజేసే ఉదాహరణలు ఉండాలి. ఇదంతా చదివితే అభ్యర్థికి ఉన్న బలాలు, నైపుణ్యాలు, కేరక్టర్ తెలియడమే కాదు, ఎంపిక చేసేందుకు దోహదపడాలి. అభ్యర్థి విశ్వసనీయతను పెంచాలి. అలాగే లెటర్ చివరి పేరాలో ముందు చెప్పిన అంశాలను క్రోడీకరించాలి. ఇంకేమైనా సమాచారం అవసరమైతే అది కూడా అందించేందుకు తాను సిద్ధమని కూడా తెలియజేయాలి. లెటర్ రాసిన వ్యక్తి సంతకం, కాంటాక్ట్ సమాచారం చివర్లో ఉండాలి. ప్రొఫెషనల్ సైన్-ఆఫ్‌తో మొత్తం పద్ధతిగా ఉండాలి.

ఈ ఆరూ ముఖ్యం

- లెటర్ ఆఫ్ రికమండేషన్స్ ఎన్ని సమర్పించినప్పటికీ అవి అభ్యర్థిలో ఉండే వివిధ కోణాలను చెప్పగలగాలి. విజయాలు, పర్సనాలిటీ అకడమిక్ లేదా ఎక్స్‌ట్రాకరిక్యులర్ సక్సెస్‌ను తెలియజేయగలగాలి. ఉదాహరణకు పరిశోధన నైపుణ్యాలు ఒక లెటర్‌లో ఉంటే మరొకదానిలో తరగతి గదిలో అభ్యర్థి కనబరిచిన సామర్థ్యాలను తెలియజేయాలి.
- రికమండ్ చేసే వ్యక్తికి మీరు తెలిసినప్పటికి సంబంధిత బేసిక్ సమాచారాన్ని అభ్యర్థి అందించాలి. సీవీ, అకడమిక్ జీపీఏలు, ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్, లెటర్ సబ్మిషన్‌కు డెడ్‌లైన్ తదితరాలు తెలియజేయాలి. అప్పుడే సదరు రికమెండర్ తన సిఫార్సును చక్కగా డ్రాఫ్ట్ చేయగలరు.
- ఆ లెటర్‌లో ప్రత్యేకించి కొన్ని సందర్భాలు, ఉపాఖ్యానాలు కూడా ఉండాలి. అభ్యర్థి లక్షణాలను తెలియజేసే విధంగా అవి ఉండాలి. లక్షణాలు, నైపుణ్యాలు తదితరాలను కేవలం ధ్రువీకరణలతో సరిపెట్టకూడదు. వాటికి సరైన ఉదాహరణలనూ జోడించాలి. రీసెర్చ్ ప్రాజెక్టుల్లో అనుభవాలు లేదంటే చోటుచేసుకున్న చర్చలను కూడా కలిపితే అభ్యర్థి క్రెడిబిలిటీ పెరుగుతుంది.
- ఆ లెటర్‌లో అభ్యర్థికి సంబంధించిన బలాలకు తోడు అకడమిక్ ప్రోగ్రెస్, డెవలప్‌మెంట్‌కూ తగు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆ అంశాల్లో కచ్చితత్వాన్ని అడ్మిషన్ కమిటీ ఎవాల్యుయేట్ చేస్తుంది. బలహీనతలను ఎలా అధిగమిస్తారన్నది కూడా చూస్తుంది.
- లెటర్ డ్రాఫ్టింగ్‌లో సమతుల్యత పాటించాలి. అస్సలు ఏమీ లేకపోవడం లేదంటే పెద్ద ఎత్తున విషయాలను కుమ్మరించడం... రెండూ పనికిరావు. ప్రొఫెషనల్ అయినప్పటికీ పర్సనలైజ్డ్ సిఫార్సులకు అడ్మిషన్ కమిటీ ప్రాధాన్యం ఇస్తుంది. అందుకని ప్రతి లెటర్ దేనికది యూనిక్‌గా ఉండాలి. బేసిక్ ఫార్మాట్ నుంచి పక్కకు తప్పకుండానే కంటెంట్ తదితర విషయాల్లో తగు జాగురూకత పాటించాలి. మొత్తమ్మీద బ్యాలెన్స్ తప్పకుండా చూసుకోవాలి.
- ప్లగారిజాన్ని తప్పించాలి. మరొక లెటర్‌కు కాపీ కారాదు. ఒరిజినల్ అనిపించాలి. కాపీని సులువుగా పట్టేస్తారు. ముందునుంచీ చెబుతున్నట్టు లెటర్ ఒరిజినల్‌గా ఉండేలా చూడాలి. అభ్యర్థిని తీసుకునేలా ఉండాలే తప్ప ఒక డూప్లికేట్ మాదిరిగా అనిపించి అసలుకే మోసం తెచ్చేలా ఉండకూడదు. అంటే కాపీ, పేస్ట్ పని మంచిది కాదని గుర్తించాలి.

ఈఎస్‌సీఐలో పీజీ డిప్లొమా

హైదరాబాద్, గచ్చిబౌలీలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఈఎస్‌సీఐ)కు చెందిన స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్(ఎస్‌పీజీఎస్)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైం ప్రోగ్రామ్. ఏడాదికి రెండు చొప్పున నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌కు ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఎడ్యుకేషనల్ లోన్ సౌకర్యం ఉంది. మెరిట్ స్కాలర్‌షిప్స్, ప్లేస్‌మెంట్స్ కూడా ఉన్నాయి.

స్పెషలైజేషన్‌లు: ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్, జనరల్ మేనేజ్‌మెంట్, ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్.

అర్హత వివరాలు: ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు ఇంజనీరింగ్/టెక్నాలజీ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు ఆర్ట్స్/కామర్స్/సైన్స్/మేనేజ్‌మెంట్ సబ్జెక్టులతో డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు ఇంజనీరింగ్/టెక్నాలజీ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులు; ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా సైన్స్ డిగ్రీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. క్యాట్/మ్యాట్/ఏటీఎంఏ/ఎక్సాట్/ఐసెట్ అర్హత పొంది ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** esci.edu.in, escihyd.org

ప్రపంచంలోనే తొలి థియేటర్ ట్రైనింగ్ సంస్థగా 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా'గా పేరుంది. 1959లో సంగీత నాటక అకాడమీ విభాగంగా ఈ సంస్థ ఆరంభమైంది. 1975లో స్వతంత్ర ప్రతిపత్తిని పొందింది. కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ విభాగం నిధులతో ప్రస్తుతం పనిచేస్తోంది. తగు జాగ్రత్తలతో ఒక ప్రణాళిక ప్రకారం రూపొందించిన సిలబస్, శిక్షణతో పకడ్బందీగా సంస్థను నిర్వహిస్తున్నారు.

ప్రస్తుతం ఈ సంస్థ డ్రమటిక్ ఆర్ట్స్‌లో మూడేళ్ల కాలవ్యవధి కలిగిన డిప్లొమాకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కోర్సులో చేరిన విద్యార్థులను యాక్టింగ్, డిజైన్, డైరక్షన్‌కు తోడు థియేటర్ సంబంధ డిసిప్లిన్స్‌లో ప్రొఫెషనల్స్‌గా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన కోర్సు ఇది. ఈ ఏడాది జూలై 24 నుంచి కోర్సు ఆరంభమవుతుంది. సీట్లు 32 కాగా వీటిలో మూడింటిని విదేశీ విద్యార్థులకు కేటాయించారు. హిందీ ఇంగ్లీష్ మాధ్యమాల్లో బోధన ఉంటుంది.

అర్హత: ఏ డిసిప్లిన్‌లో అయినా మూడేళ్ళ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఆరు వేర్వేరు థియేటర్ ప్రొడక్షన్స్‌లో పాల్గొని ఉండాలి. అందుకు తగు ప్రూఫ్‌ని సమర్పించాలి. హిందీ/ ఇంగ్లీష్ భాషలు తెలిసి ఉండాలి. ఈ ఏడాది జూలై 1 నాటికి



ఎన్ఎస్‌డీలో డిప్లొమా

వయసు 18-30 మధ్య ఉండాలి. రిజర్వుడు వర్గాలకు నిబంధనల మేరకు సడలింపు ఉంటుంది.

ఎంపిక: ఇది రెండు దశలుగా ఉంటుంది. ప్రిలిమినరీ ఎగ్జామ్ ఉంటుంది. ఇందులో ఎంపికైన వారికి ఫైనల్ ఎగ్జామినేషన్ వర్క్‌షాప్ ఉంటుంది. దేశంలోని వివిధ నగరాల్లో వేర్వేరు తేదీల్లో ఈ రెండూ జరుగుతాయి. హైదరాబాద్‌లో మే 27న జరుగుతుంది. వివరాలు ఎన్ఎస్‌డీ వెబ్‌సైట్‌లోనూ ఉంటాయి. తుది ఎంపిక న్యూఢిల్లీలో ఉంటుంది. జూన్ 23 నుంచి 27 వరకు అంటే అయిదు రోజులు ఉంటుంది. దీనికి పిలిచిన అభ్యర్థులకు వారి సొంత ఊరి నుంచి ట్రావెల్ ఎక్స్‌పెన్సస్‌కు తోడు డీఏ చెల్లిస్తారు. నిపుణులతో కూడిన కమిటీ వీరి ప్రతిభను పరిశీలించి తుది ఎంపిక జరుపుతుంది. ఫిజికల్ ఫిట్‌నెస్ తప్పనిసరి. అందుకు మెడికల్ టెస్ట్ కూడా ఉంటుంది.

కోర్సు వివరాలు: కోర్సు కాల వ్యవధి మూడేళ్ళు కాగా ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఒక్కో సెమిస్టర్ 20 వారాల పాటు ఉంటుంది. మొదటి మూడు సెమిస్టర్లు కామన్. చివరి మూడు సెమిస్టర్లలో స్పెషలైజేషన్ ఉంటుంది. ఇందులో డిజైన్, డైరక్షన్‌లో మాత్రం అయిదుగురు విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంటుంది. కోర్సుకు ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.9,500 చెల్లిస్తారు.

దరఖాస్తు: ఫీజు రూ.50. **దరఖాస్తుకు ఆఖరు తేదీ:** మే 10

వెబ్‌సైట్: www.nsd.gov.in http://www.onlineadmission.nsd.gov.in

ఎన్‌పీసీఐఎల్‌లో ఎగ్జిక్యూటివ్ ట్రైనీలు

జాబ్ కార్నర్

ముంబయిలోని కేంద్రప్రభుత్వ రంగ సంస్థ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్) కింది విభాగాల్లో 400 ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హులైన అభ్యర్థులు ఏప్రిల్ 30 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఎగ్జిక్యూటివ్ ట్రైనీ: 400 పోస్టులు. (ప్రస్తుత ఖాళీలు 396, బ్యాక్‌లాగ్ ఖాళీలు 4)

విభాగాలు: మెకానికల్, కెమికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్.

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ, బీటెక్, బీఎస్సీ/ ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.

NPCIL

వయసు: ఏప్రిల్ 30 నాటికి 26 సంవత్సరాలు మించకూడదు.

ప్రారంభ వేతనం: నెలకు రూ.56,100

ఎంపిక: గేట్ 2022/ 2023/ 2024 స్కోర్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.500(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: ఏప్రిల్ 30

వెబ్‌సైట్: https://npcilcareers.co.in/MainSiten/default.aspx

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/N2VHWUUలో **చదవండి.**

నవ్య | చిత్రజ్యోతి

అసలైన రామాయణాన్ని తీయబోతున్నాం
- యశ్



ఇప్పటివరకూ పలు భారతీయ భాషల్లో రామాయణంపై ఎన్నో చిత్రాలు వచ్చాయి. వాటిల్లో ఎన్నో అభూత కల్పనలు, వక్రీకరణలు, మార్పులు చోటు చేసుకున్నాయి. క్రియేటివ్ ఫ్రీడమ్ పేరుతో రచయితలు, దర్శకులు చేసిన ప్రయోగాల వల్ల కొన్ని సినిమాలు అపఖ్యాతిని మూటగట్టుకున్నాయి. వాటన్నింటికీ భిన్నంగా నిజమైన రామాయణాన్ని వెండితెరపైకి తెచ్చేందుకు తాము సిద్ధమవుతున్నామని హీరో యశ్ చెప్పారు. ఆయన సొంత నిర్మాణ సంస్థ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్, నిర్మాత నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ సంయుక్తంగా రామాయణాన్ని నిర్మించబోతున్నారు. నితీశ్ తివారి దర్శకత్వం వహిస్తున్నారు. 'ఇప్పటి వరకూ చాలా రామాయణాలు వెండితెరపైన వచ్చినా అందులో పూర్తిగా రామాయణం ఆధారంగా తెరకెక్కిన చిత్రం ఏది అనేది తెలియదు. కానీ మేం ఇప్పుడు అసలైన రామాయణాన్ని తీయబోతున్నాం' అని యశ్ శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రామాయణం చేస్తే బాగుంటుందని నమిత్, నేను చాలా సార్లు అనుకున్నాం. కానీ అంత పెద్ద సబ్జెక్ట్‌ను తీయాలంటే బడ్జెట్ సరిపోదు. అందుకు నేను కూడా సహ నిర్మాతగా చేరాను. రామాయణానికి నా మనసులో ప్రత్యేక స్థానం ఉంది. దానికోసం ఎంతైనా కష్టపడతాను. అందులో ఉన్న భావోద్వేగాలు, విలువలు గురించి ప్రపంచం అంతా చాటాలి. డీఎన్ఈజీ విజువల్ ఎఫెక్ట్స్ ద్వారా ఇప్పటివరకూ చూడని సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ప్రేక్షకులకు అందించబోతున్నాం' అని చెప్పారు. రామాయణం లాంటి గొప్ప ప్రాజెక్ట్‌ను ప్రపంచస్థాయి వేదికలపైకి తీసుకెళ్లాలంటే యశ్ లాంటి వారికే సాధ్యం అని నమిత్ మల్హోత్రా చెప్పారు. అయితే ఈ సినిమాలో యశ్ నటుడిగా ఏ పాత్రలో కనిపించనున్నారనే విషయాన్ని బయటపెట్టలేదు. గతంలో ఆయన రావణుడి పాత్రలో కనిపించనున్నట్లు వార్తలు వచ్చాయి. రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి సీతారాములుగా కనిపించనున్నారని టాక్. 'కేజీయఫ్' సిరీస్‌తో హీరోగా స్టార్‌డమ్ దక్కించుకున్నారు యశ్. ప్రస్తుతం ఆయన 'టాక్సిక్' అనే చిత్రం చేస్తున్నారు.

యూనిక్ కాన్సెప్ట్‌తో



'వైశాలి' చిత్రాన్ని అందించిన హీరో ఆది పినిశెట్టి, దర్శకుడు అరివళగన్‌ల కాంబినేషన్‌లో వస్తున్న మరో చిత్రం 'శబ్దం'. ఈ సినిమా టీజర్‌ను విక్టరీ వెంకటేశ్ శుక్రవారం విడుదల చేశారు. హీరో ఆది ఒక హాంటెడ్ హౌస్ దగ్గర కొన్ని వింత సంఘటనలు జరిగినప్పుడు విచిత్రమైన శబ్దాలను రికార్డ్ చేయడం కనిపిస్తుంది. ఒక యూనిక్ కాన్సెప్ట్‌తో దర్శకుడు ఈ టీజర్‌ను టెరిఫిక్‌గా ప్రజెంట్ చేశారు. 'వైశాలి'లో రెయిన్ బేస్డ్ సీన్లు చాలా ఉండగా, 'శబ్దం'లోని అధిక శాతం సీన్లను ముంబై, మున్నార్, చెన్నై వంటి పర్యాటక ప్రదేశాల్లో చిత్రీకరించారు. అలాగే ఈ సినిమా కోసం 120 ఏళ్ల నాటి లైబ్రరీ సెట్ వేయడం విశేషం. సిమ్రన్, లైలా, లక్ష్మీ మీనన్, రెడిన్ కింగ్స్లీ తదితరులు నటించిన ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తామని నిర్మాత సెవన్ జీ శివ చెప్పారు. తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.

అటు కృష్ణమ్మ... ఇటు దుర్గమ్మ

ఎటువంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా కేవలం ప్రతిభతో ఒక్కో మెట్టూ ఎక్కుతూ మంచి నటుడిగా పేరు తెచ్చుకున్న సత్యదేవ్ తాజా చిత్రం 'కృష్ణమ్మ' రస్టిక్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ మూవీగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం మే 3న విడుదల కానుంది.



వీవీ గోపాలకృష్ణ దర్శకుడు. ప్రముఖ దర్శకుడు కొరటాల శివ సమర్పణలో కృష్ణ కొమ్మాలపాటి నిర్మిస్తున్నారు.


ఈ సినిమా నుంచి 'దుర్గమ్మ' అనే సెలబ్రేషన్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటను సాకేత్ కొమండూరి పాడారు. కాలాభైరవ స్వరాలు సమకూర్చారు. నవరాత్రుల సమయంలో దుర్గమ్మ ముందు హీరో సంతోషంగా ఆడి పాడే పాట ఇది. అతీరా రాజ్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో లక్ష్మణ్, కృష్ణ, అర్చన, రఘు కుంచె, నందగోపాల్ ఇతర ముఖ్యతారాగణం.

చాలా రోజుల తర్వాత డాన్స్ చేశా
- వరలక్ష్మీ శరత్‌కుమార్



వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'శబరి'. అనిల్ కాట్జ్ దర్శకత్వంలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించారు. తెలుగు, హిందీతో పాటు పలు భారతీయ భాషల్లో మే 3న విడుదలవుతోంది. శుక్రవారం చిత్ర బృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. తెలుగు ట్రైలర్‌ను హీరో వరుణ్‌సందేశ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మీ శరత్‌కుమార్ మాట్లాడుతూ 'తెలుగులో తొలి సారి కథానాయిక ప్రాధాన్య చిత్రం చేశాను. మా నిర్మాత కథను నమ్మి రాజీపడకుండా సినిమా చేశారు. చాలా రోజుల తర్వాత ఈ సినిమాలో డాన్స్ చేశా' అన్నారు.

ఆస్పత్రిలో చేరిన సాయాజీ షిండే



పలు చిత్రాల్లో విలన్‌గా నటించిన సాయాజీ షిండేకు తీవ్రమైన ఛాతి నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ని హుటాహుటిగా మహారాష్ట్రలోని సతారా ఆస్పత్రిలో చేర్పించారు. పలు వైద్య పరీక్షల అనంతరం గుండెకు రక్తాన్ని సరఫరా చేసే నాళాలు బ్లాక్ అయ్యాయని వైద్యులు గ్రహించారు. వెంటనే ఆయనకు యాంజియోప్లాస్టీ చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. త్వరలోనే డిస్చార్జి చేస్తామన్నారు.

మహారాష్ట్రకు చెందిన సాయాజీ నటుడిగా తెలుగు వారికి సుపరిచితుడే. వచ్చీ రాని తెలుగులో ఆయన డైలాగులు పలికే విధానం ప్రేక్షకులను బాగా నవ్విస్తుంది. హిందీ, మరాఠీ చిత్రాల్లో నటించిన సాయాజీ దక్షిణాదిన కూడా పలు సినిమాల్లో కీలక పాత్రలు పోషించారు.

కార్తికేయ... వాయు వేగం

కార్తికేయ గుమ్మకొండ కథానాయకుడిగా ప్రశాంత్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి టైటిల్ ఖరారైంది. 'భజే వాయువేగం' అనే టైటిల్‌ను చిత్రబృందం ఖరారు చేసింది. శుక్రవారం మహేశ్‌బాబు సోషల్ మీడియా ద్వారా ఈ చిత్రం టైటిల్, ఫస్ట్‌లుక్ మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో క్రికెట్ బ్యాట్‌తో కార్తికేయ పరుగు తీస్తుండగా, నేపథ్యంలో కరెన్సీ ఎగురుతూ కనిపించింది. టైటిల్, పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉన్నాయి, సినిమా ఘన విజయం అందుకోవాలి అని మహేశ్‌బాబు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.



.ఈ చిత్రాన్ని త్వరలో ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాణ సంస్థ యూవీ కాన్సెప్ట్స్ సన్నాహాలు చేస్తోంది. ఐశ్వర్యమీనన్ కథానాయికగా నటిస్తున్నారు. 'హ్యాపీడేస్' ఫేమ్ రాహుల్ టైసన్ ముఖ్యపాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: రధన్. సినిమాటోగ్రఫీ: ఆర్. డి రాజశేఖర్

రాజ్ తరుణ్ క్రైమ్ కామెడీ

రాజ్ తరుణ్, రాశీ సింగ్ హీరోహీరోయిన్లుగా నటించే కొత్త చిత్రం షూటింగ్ శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. రమేశ్ కుడుముల ని దర్శకుడిగా పరిచయం చేస్తూ మురళీధర్ రెడ్డి, కెటిఎన్ శ్రీనివాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. హీరో హీరోయిన్లపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు దర్శకుడు ప్రవీణ్ సత్తారు కెమెరా స్విచ్ ఆన్ చేయగా, మరో దర్శకుడు మారుతి తొలి క్లాప్ ఇచ్చారు. తొలి షాట్‌కు నక్కిన త్రినాథరావు గౌరవ దర్శకత్వం వహించారు.



ఈ సందర్భంగా ఏర్పాటైన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు మాట్లాడుతూ 'ఈ నెల 15 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుంది. అక్టోబర్‌లో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. ఇది క్రైమ్ కామెడీ. 'స్వామి రారా', 'అంధధూన్' చిత్రాల తరహాలో ఉంటుంది' అని తెలిపారు. నిర్మాతల్లో ఒకరైన శ్రీనివాస్ మాట్లాడుతూ 'కథ అద్భుతంగా వచ్చింది. మీ అందరికీ నచ్చుతుంది' అన్నారు. 'నా ఫేవరెట్ జానర్ క్రైమ్ కామెడీ. చాలా మంచి కథ. మీ అందరి ఆశీస్సులు కావాలి' అన్నారు రాజ్ తరుణ్. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్ చంద్ర, డీవోపి: ఆదిత్య జవ్వాడి, ఎడిటింగ్: ప్రవీణ్ పూడి.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Bw03CGf **లో చదవండి.**



న్యూ ఏజ్ సినిమా
దిల్‌రాజు

ఆశిష్, వైష్ణవిచైతన్య నటించిన చిత్రం 'లవ్ మీ'. ఇఫ్ యు డేర్ ఉప శీర్షిక. అరుణ్ భీమవరపు దర్శకత్వం వహించారు. శిరీశ్, దిల్‌రాజు సమర్పణలో హర్షిత్‌రెడ్డి, నాగమల్లిడి, హన్షిత నిర్మించారు. 'లవ్ మీ' చిత్రం ఈ నెల 25న విడుదలవుతోంది. ఇటీవల ఈ మూవీ ఆడియో వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ "సరికొత్త కథాంశంతో వస్తున్న ఈ న్యూ ఏజ్ సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది" అన్నారు. డైరెక్టర్ అరుణ్ భీమవరపు మాట్లాడుతూ "ఈ సినిమాకు వస్తున్న పాజిటివ్ వైబ్స్ చూసి సంతోషంగా ఉంది" అని అన్నారు. హీరో ఆశిష్ మాట్లాడుతూ "ఈ సినిమాలోని లవ్, హారర్, సస్పెన్స్ ఎలిమెంట్స్ అందరికీ మంచి థ్రిల్ ఇస్తాయి" అని అన్నారు. నటి వైష్ణవిచైతన్య మాట్లాడుతూ "డిఫరెంట్ లవ్ స్టోరీ ఇది" అని చెప్పారు. చిత్ర నిర్మాత హన్షిత మాట్లాడుతూ "ఎప్పుడైనా, ఎవరైనా గోస్ట్‌ని లవ్ చేశారా? లవ్ చేయండి. మీకు తప్పకుండా నచ్చుతుంది" అని చెప్పారు.

కిడ్నాప్ డ్రామా



చైతన్యారావు, సునీల్, శ్రద్ధా దాస్, మాళవిక సతీశన్ ప్రధాన పాత్రలు పోషించిన 'పారిజాత పర్వం' చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. సంతోష్ కంభంపాటి దర్శకత్వంలో మహీధర్ రెడ్డి , దేవేష్ నిర్మించిన హిలేరియస్ క్రైమ్ కామెడీ చిత్రమిది. ఈ సినిమా ట్రైలర్‌ను యాంకర్ సుమ లాంచ్ చేశారు. 'కేక్ కట్ చేసేటప్పుడు లైట్స్ ఆర్పుతారట. మళ్లీ లైట్స్ వేసే లోపు కేక్‌తో పాటు వాళ్ల ఆవిడ కూడా మన బండిలో ఉండాలి' అని కిడ్నాప్ ప్లాన్‌ను సునీల్ తన గ్యాంగ్‌కు వివరిస్తుండగా మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది.

'కిడ్నాప్ ఈజ్ యాన్ ఆర్ట్' అనే ట్యాగ్ లైన్‌ను జస్టిఫై చేస్తూ ఇందులో చూపించిన సన్నివేశాలు హిలేరియస్‌గా ఉన్నాయి. చైతన్యా రావు, సునీల్, శ్రద్ధా దాస్.. ఈ మూడు పాత్రల చుట్టూ నడిపిన కిడ్నాప్ డ్రామా ఇది. విజువల్స్, నిర్మాణ విలువలు బాగున్న ఈ ట్రైలర్ సినిమా మీద ఆసక్తిని మరింత పెంచింది.